రియల్టర్ దామా సుబ్బారావు అరెస్టు

- ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు తొలగించారనే అభియోగం
- రోడ్డు నిర్మాణానికీ యత్నం
- రెవెన్యూ అధికారుల ఫిర్యాదు

6లో



సర్వే నంబరు 47లో గల గెడ్డ వాగులో రెవెన్యూ అధికారులు మళ్లీ ఏర్పాటుచేసిన బోర్డు

కనకమహాలక్ష్మి దేవస్థానంలో

విగ్రహం వెనుక తాపడం కొత్తది తయారుచేయించి ఇస్తే పాతది ఇస్తామని నాలుగేళ్ల క్రితం మాల్ అధినేత వద్ద అధికారుల ప్రతిపాదన

- 60 కిలోలతో తయారుచేయించి ఆలయానికి బహూకరణ
- పాత వెండి ఇవ్వని అధికారులు

వెండిపై వివాదం

- తమకు ఇస్తామన్న వెండి ఇవ్వలేదని తాజాగా దాత లేఖ
- విచారణ జరుపుతున్న డిప్యూటీ కమిషనర్
- లెక్కల్లో తేడా?
- 60 కిలోల తాపడానికి కనిపించని రశీదులు
- కమిషనర్ దృష్టిలో పెట్టకుండా నోటిమాటలతోనే వ్యవహారం



కనకమహాలక్ష్మి అమ్మవారు. విగ్రహం వెనుక వెండి తాపడం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కనకమహాలక్ష్మి ఆలయంలో వెండి వస్తువుల లెక్క తేలడం లేదు. గత నాలుగేళ్లుగా వెండి ఆభరణాల వివరాలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారుల వద్ద లేవు. ప్రముఖ దాత లేఖతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ మొదలైంది.

వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు బంగారు, వెండి ఆభరణాలు కానుకగా ఇస్తారు. వాటికి దేవస్థానం అధికారులు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలి. ఆభరణాలను లాకర్లో భద్రపరచాలి. ఎగ్జిక్యూటివ్ అధికారి (ఈఓ) ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయినప్పుడు వాటి లెక్కలను కొత్త ఈఓకి అప్పగించాలి. అయితే గత నాలుగేళ్లుగా బంగారు ఆభరణాల లెక్కలు ఈఓలకు అందుతున్నాయి గానీ వెండి వివరాలు అందడం లేదు. అత్యంత వివాదాస్పద అధికారిణిగా పేరు తెచ్చుకున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగరి శాంతి ఈ దేవస్థానంలో ఈఓగా 2022లో పనిచేశారు. అంతకు ముందు పనిచేసిన ఈఓ జ్యోతి మాధవి వెండి లెక్కలు తనకు అప్పగించలేదని చెబుతూ శాంతి తన తరువాత వచ్చిన ఈఓ శిరీషకు ఆ లెక్కలు ఇవ్వలేదు. ఆ తరువాత ఈఓగా శ్రీనివాసరెడ్డి వచ్చారు. ఆయనకూ అవి అందలేదు. ఆ తరువాత శోభారాణి ఈఓగా వచ్చి ఏడాది అవుతోంది. ఆమెకూ వెండి వివరాలు అందలేదు. ఎవరూ దీని గురించి పెద్దగా పట్టించుకోలేదు. నగరంలో ప్రముఖ దాత ఒకరు కొద్దిరోజుల క్రితం దేవస్థానానికి లేఖ రాశారు. ఆలయంలో అమ్మవారి విగ్రహం వెనుక గోడకు వెండి తాపడం కొత్తది చేయించి ఇవ్వాలని నాలుగేళ్ల క్రితం తమను కోరారని, ఆ ప్రకారం 60 కిలోలతో తయారుచేయించి ఇచ్చామని, దానికి బదులు పాత తాపడం 34 కిలోలు తమకు ఇస్తామన్నారని, అలాగే వెండి దానం చేయడానికి ఎవరైనా ముందుకు వస్తే.. ఆ వెండి కూడా తమకే ఇస్తామన్నారని, కానీ ఇంత వరకు ఒక్క గ్రాము వెండి కూడా తమకు ఇవ్వలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇది ఆలయ వర్గాల్లో కలకలం రేపింది. దాంతో ఆగమేఘాలపై వెండి లెక్కలు అప్పగించాలని ఇప్పటి ఈఓ శోభారాణి పాత ఈఓలు అందరికీ ఫోన్లు చేసి పిలిచారు. నాలుగు రోజుల క్రితం జ్యోతి మాధవి, కాళింగరి శాంతి, శిరీష, తదితరులంతా వచ్చి ఆ లెక్కలు ఇచ్చి వెళ్లిపోయారు. అయితే ప్రస్తుతం అమ్మవారి విగ్రహం వెనుక ఉన్న కొత్త వెండి తాపడం 60 కిలోలు ఎవరు ఇచ్చారనే దానికి లెక్కలు ఎక్కడా కనిపించలేదు. అంటే రశీదు లేదు. దానిని ప్రముఖ దాత ఇచ్చారనే విషయం అందరికీ తెలుసు. కానీ దానికి ఆధారాలు లేవు. ఇది ఎలా జరిగిందనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. దానంగా ఇస్తేనే రశీదులు ఇస్తారని, అలా కాకుండా పాత వస్తువు ఇచ్చి కొత్త వస్తువు తీసుకుంటే ఇవ్వరని, అందువల్లే దానిని లెక్కలో చూపించలేదని ఆలయ వర్గాలు అంటున్నాయి. అయితే

... మిగతా 6వ పేజీలో

అబద్ధాల సృష్టి!

అమాయకులను నిలువునా మోసగించిన ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు

- హైదరాబాద్ సెంటర్ కన్సల్టింగ్‌కు మాత్రమే
- విశాఖ కేంద్రంగానే అడ్డగోలు వ్యవహారాలు
- సరోగసీ పేరుతో దంపతుల నుంచి భారీ మొత్తంలో వసూలు
- పదుల సంఖ్యలో నవజాత శిశువుల విక్రయాలు సాగినట్టు నిర్ధారణ
- దళారులు, వైద్యుల పాత్ర



విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):

'సృష్టి' ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకుల అక్రమాలు తవ్వుతున్న కొద్దీ వెలుగులోకి వస్తున్నాయి. హైదరాబాద్ సెంటర్‌ను కన్సల్టింగ్‌కు మాత్రమే వినియోగించిన నిర్వాహకులు...మొత్తం వ్యవహారమంతా విశాఖలోనే నడిపినట్టు అక్కడి పోలీసులు తేల్చారు. ఇక్కడ అనధికారికంగా నిర్వహించిన సెంటర్‌లో నకిలీ సరోగసీ, పిల్లల అమ్మకాలు, అక్రమ రవాణా వంటి వాటికి పాల్పడినట్టు నిర్ధారించారు. పిల్లలు లేని దంపతులు హైదరాబాద్‌లోని సృష్టి సెంటర్‌కు వెళితే అక్కడ పరీక్షలు నిర్వహించిన అనంతరం మిగిలిన ప్రక్రియను విశాఖలో కొనసాగిస్తున్నట్టు చెప్పేవారు. ఈ మేరకు ఇప్పటివరకూ జరిగిన విచారణ వివరాలను హైదరాబాద్ పోలీసులు మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

సరోగసీ నిర్వహించినట్టు వసూలు

పిల్లలు లేని దంపతులను దళారులు గుర్తించి సృష్టి సెంటర్‌కు తీసుకువెళ్లేవారు. ఆస్పత్రికి వచ్చిన వారిని ఐవీఎఫ్, సరోగసీకి ఒప్పించడం వైద్యుల బాధ్యత. ఇందుకోసం ఉన్నత స్థాయిలో వైద్యుల నుంచి కింది స్థాయిలో దళారులు, గర్భం దాల్చి బిడ్డను వద్దనుకునే గర్భిణుల వరకూ అందరినీ సృష్టి యాజమాన్యం అత్యంత పకడ్బందీగా సమకూర్చుకుంది. పిల్లలు కావాలని ఎవరైనా సృష్టి ఆస్పత్రికి వస్తే వారికి తొలుత ఐవీఎఫ్ పేరుతో వైద్యం అందించడం, ఆ తరువాత అది సక్సెస్ కాలేదని చెప్పి సరోగసీకి ఒప్పించడం చేస్తుండేవారు. ఇలా సరోగసీకి ఒప్పుకున్న దంపతులకు పరీక్షలు నిర్వహించడం, వీర్యం సేకరించడం వంటివి చేసేవారు. తదుపరి ప్రక్రియను విశాఖలో నిర్వహిస్తున్నామని చెప్పేవారు. ఈ క్రమంలో వారికి బిడ్డను అప్పగించే తేదీని కూడా చెబుతారు. అయితే, విశాఖలోని కేంద్రంలో సరోగసీ మాత్రం నిర్వహించరు. సరోగసీ ప్రక్రియ కొనసాగుతున్నట్టు ఎప్పటికప్పుడు సదరు క్లయింట్స్‌కు అల్ట్రాసౌండ్ పరీక్షలకు సంబంధించిన ఫొటోలు పెడుతుంటారు. వారికి చెప్పిన తేదీకి ప్రసవం అయ్యే గర్భిణిని గుర్తించే బాధ్యతను దళారులు చూసుకుంటారు. ముఖ్యంగా అసహజ గర్భధారణ జరిగిన, బిడ్డ వద్దనుకునే వారిని గుర్తించి వారికి ఈ కేంద్రంలో ప్రసవాన్ని నిర్వహించేవారు. ఆ బిడ్డను సదరు క్లయింట్స్‌కు వారి బిడ్డగా అప్పగించి ఆర్థిక ఆర్థిక స్థితిని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసేవారు. ఇలా గర్భిణిని సమకూర్చిన దళారులకు బిడ్డ పాప అయితే రూ.3.5 లక్షలు, బాబు అయితే రూ.4.5 లక్షలు సృష్టి యాజమాన్యం చెల్లించేది. ఇందులోనే కొంత మొత్తాన్ని బిడ్డ ఇచ్చిన మహిళకు సదరు దళారులు చెల్లించేవాళ్లు. ఇలా అక్రమంగా నవజాత శిశువుల విక్రయాన్ని పకడ్బందీగా కొన్నేళ్ల నుంచి నిర్వహిస్తూ వచ్చారు. అలా ఇచ్చిన బిడ్డకు తమ డీఎన్ఏ మ్యాచింగ్ కాకపోవడంతో చేసిన ఫిర్యాదుతో సృష్టి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

నిద్రమత్తులో ఆరోగ్య శాఖ

సృష్టి వ్యవహారాలు విశాఖ కేంద్రంగా జరిగినా ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం గుర్తించలేదు. ఈ సెంటర్‌కు 2018లో అనుమతి ఇచ్చారు. 2023 నుంచి సదరు యాజమాన్యం రెన్యువల్ కూడా చేయించుకోలేదు. ఈ ఐదేళ్లలో ఇక్కడ అనేక అక్రమాలు, ఫేక్ సరోగసీ జరిగినా పట్టించు కోలేదు. తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి వెళ్లిపోవడం వల్లే ఈ వ్యవహారాలను

... మిగతా 6వ పేజీలో

ఐవీఎఫ్, సరోగసి అంటే...

ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) ప్రక్రియలో స్త్రీ నుంచి అండాలను, పురుషుడి నుంచి వీర్య కణాలను సేకరించి ప్రయోగ శాలలో ఫలదీకరణ చేస్తారు. ఇలా ఫలదీకరణ చేయడం ద్వారా ఏర్పడే పిండాన్ని స్త్రీ గర్భాశయంలోకి పంపిస్తారు. ఈ విధంగా దంపతులకు సంతానం కలిగేలా చేస్తారు. గర్భ సంచి సమస్యతో బాధపడే మహిళ తల్లి కావాలనుకుంటే ఇదే ప్రక్రియను మరో మహిళ గర్భం (అద్దె గర్భం)లో చేస్తారు. దీనిని సరోగసీ అంటారు. సరోగసీలో బిడ్డను కని ఇచ్చే తల్లికి బిడ్డతో సంబంధం ఉండదు. ఇందుకు సంబంధించిన కీలకమైన ఉత్తర్వులను కూడా కేంద్రం గతంలో విడుదల చేసింది.

ట్యాంకర్ల టెండర్లలో కాంట్రాక్టర్లు రింగ్

ఒక్కో ట్యాంకర్‌కు ఇద్దరు, ముగ్గురితోనే బిడ్

- టెండర్ వచ్చేలా ఒకరు... డమ్మీలుగా మరో ఇద్దరు
- చక్రం తిప్పిన కాంట్రాక్టర్ల సంఘం నేత
- కాదని బిడ్ వేస్తే అనర్హులుగా చేయిస్తానని బెదిరింపులు
- కాంట్రాక్టర్ల మధ్య పోటీ తగ్గడంతో జీవీఎంసీ ఖజానాకు గండి



టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో నీటి ట్యాంకర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఒకటో డివిజన్ పరిధిలో మంచినీటి సరఫరా కోసం ట్యాంకర్లను సమకూర్చేందుకు టెండర్లు పిలవగా, కాంట్రాక్టర్లు రింగ్ అయిపోయారు. ఎవరికివారు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు వేయకుండా...ఒక పనికి ఒకరు కాస్త తక్కువకు బిడ్ వేస్తే...డమ్మీగా మరో ఇద్దరు అంతకంటే కాస్త ఎక్కువకు బిడ్ వేశారు. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్ల సంఘం నేత ఒకరు చక్రం తిప్పారు. కాంట్రాక్టర్లతో సమావేశం పెట్టి మరీ ఎవరైనా తనను కాదని బిడ్ వేస్తే వారికి చుక్కలు కనిపిస్తాయని హెచ్చరించారు.

కొండవాలు ప్రాంతాలతోపాటు ఎప్పుడైనా ఎక్కడైనా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకుంటారు. జీవీఎంసీ వద్ద నీటి ట్యాంకర్లు లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల నుంచి వాటిని సమకూర్చుకుంటారు. ఏడాది కాలానికి లీజు నిమిత్తం రెండు కిలోలీటర్లు (రెండు వేల లీటర్లు), ఐదు కిలోలీటర్లు (ఐదు వేల లీటర్లు) సామర్థ్యం కలిగిన ట్యాంకర్ల కోసం ఏటా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలుస్తుంటారు. ఈ ఏడాది కూడా నీటి సరఫరా విభాగం ఒకటో డివిజన్ (భీమిలి, మధురవాడ జోన్‌లతో పాటు ఆశీల్‌మెట్ట జోన్‌లోని కొంత ప్రాంతం) పరిధిలో నీటి సరఫరా చేసేందుకు

... మిగతా 6వ పేజీలో

22న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):



జీవీఎంసీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 22న నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. పీలా మేయర్‌గా ఎన్నికైన తర్వాత తొలి కౌన్సిల్ సమావేశం మే ఆరున జరిగింది. రెండో సమావేశం ఈనెల 13న నిర్వహించాలనుకున్నప్పటికీ అనివార్యకారణాలతో 22కి వాయిదా వేశారు. ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు వీలుగా అన్ని విభాగాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు.

నవంబరులో కార్పొరేటర్ల యాత్ర

జీవీఎంసీ కార్పొరేటర్ల వార్షిక అధ్యయన యాత్రను ఈ ఏడాది నవంబరులో నిర్వహించాలని నిర్ణయించారు. కార్పొరేటర్లు ఏటా అధ్యయన యాత్ర పేరుతో వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో పర్యటించాలని నిర్ణయించారు. కార్పొరేటర్ల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చిలో ముగియనున్నది. ఈ నేపథ్యంలో కనీసం పదిరోజులు యాత్ర ఉండేలా షెడ్యూల్ రూపొందించాలని కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు.

ఉక్కు విద్యాలయాలకు చిక్కులు

విశాఖ విమల విద్యాలయం మూసేసినట్టే?

- భవనం లీజుపై ఒప్పందం చేయని స్టీల్‌ప్లాంటు యాజమాన్యం
- కోర్టును ఆశ్రయించిన నిర్వహణ సంస్థ
- వేరే విద్యా సంస్థలో చేరిన విద్యార్థులు
- కేంద్రీయ విద్యాలయంపైనా అదే తీరు
- ఒకటో తరగతి, ప్లస్ 1లో రెండేళ్లుగా ప్రవేశాలు నిలిపివేత
- క్రమేణా మూసివేత దిశగా అడుగులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోంది. ప్రాజెక్టు స్కూళ్లుగా ప్రారంభించిన విశాఖ విమల విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం నిర్వహణ బాధ్యతల నుంచి క్రమంగా తప్పుకుంటోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని విద్యా సంస్థల నిర్వహణకు ఇంతకు ముందులా నిధులు ఇవ్వలేమని చెబుతోంది. స్థానిక ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు గత ఏడాది విశాఖ విమల విద్యాలయాన్ని నడిపినా ఈ ఏడాది ఇక తమ వల్ల కాదని చేతులు ఎత్తేసింది. దాంతో అది మూత పడింది.

స్టీల్‌ప్లాంటుకు టౌన్ షిప్‌లో విశాఖ విమల విద్యాలయం, దానికి అనుబంధంగా బాలచెరువు రోడ్డులో మరొక స్కూల్ ఉన్నాయి. ఈ రెండింటిలో సుమారుగా రెండువేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ విద్యాలయం నిర్వహణ బాధ్యతలను డయసిస్ సంస్థకు స్టీల్‌ప్లాంటు అప్పగించింది. ఏడాదికి రూ.5 కోట్ల వరకు ఆర్థిక సాయం చేస్తోంది. మిగిలిన మొత్తాన్ని డయసిస్ విద్యార్థుల నుంచి ఫీజుల రూపేణా వసూలుచేస్తోంది. ఓ దశాబ్దం నుంచి స్టీల్‌ప్లాంటు డబ్బులు ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. ఫీజులు పెంచి నిధులు సమకూర్చుకోవాలని చెబుతోంది. అయితే ఎక్కువ మంది పేద పిల్లలు ఉన్నందున, వారు అధిక ఫీజులు భరించలేరని డయసిస్ చెబుతోంది. గత ఏడాదే ఈ విద్యా సంస్థను మూసేయడానికి

... మిగతా 6వ పేజీలో



విమానాశ్రయం రోడ్డులో సర్వే అధికారులతో ఎమ్మెల్యే గణబాబు పర్యటన

ఎన్ఏడీ-ఎయిర్‌పోర్టు మధ్య 3 మెట్రో స్టేషన్లు

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టులో విమానాశ్రయం నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు మూడు స్టేషన్లు వస్తాయని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. దీనికి సంబంధించి మంగళవారం క్షేత్ర స్థాయి పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు...అధికారులతో మాట్లాడుతూ, మూడు స్టేషన్ల వద్ద పార్కింగ్ స్లాట్ల సంఖ్య అధికంగా పెట్టాలని సూచించారు. విమానాశ్రయం, ఎన్ఏడీ జంక్షన్ చాలా కీలకమైన స్టేషన్లు అయినందున ఎక్కే ప్రయాణికులు, దిగే ప్రయాణికుల సంఖ్యను దీర్ఘ కాలంలో దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలో తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్రో చీఫ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ యుజెఎం రావు, ప్రాజెక్టు మేనేజర్ సంపత్, విమానాశ్రయం ట్రాఫిక్ సీఐ దశరథ్, కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

మారని ఏయూ తీరు!

- దూర విద్య విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణ
- ఈసారి కూడా ప్రైవేటు కళాశాలల్లోనే!
- 65 కాలేజీల ఎంపిక
- విద్యార్థుల నుంచి కొన్ని కళాశాలల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఎప్పటినుంచో ఆరోపణలు
- ఈ క్రమంలో ప్రభుత్వ కళాశాలల్లో నిర్వహించాలని ఇటీవల నిర్ణయం
- ...కానీ కార్యరూపం దాల్చని వైనం
- అక్కడ పనిచేసే సిబ్బందిని మార్చే విషయంలోనూ వెనక్కి తగ్గిన అధికారులు



విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):


ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరు మారడం లేదు. దూర విద్య ప్రాక్టికల్స్ ఈసారి కూడా ప్రైవేటు కళాశాలల్లోనే నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 18 నుంచి వచ్చే నెల మొదటి వారం వరకూ ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇటు శ్రీకాకుళం నుంచి అటు అనంతపురం వరకు 65 కాలేజీలను ఎంపిక చేశారు.

దూరవిద్య పరీక్షలు, ప్రాక్టికల్స్ నిర్వహణ కేంద్రాలుగా ఉన్న పలు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈ వ్యవహారంపై పత్రికల్లో కథనాలు రావడంతో ఉన్నతాధికారులు ఆరా తీశారు. అనేకచోట్ల మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్టు తేల్చారు. దీంతో దూర విద్య పరీక్షా కేంద్రాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకోవాలని భావించారు. తొలుత

... మిగతా 6వ పేజీలో

ఎర్రాజీ జ్యోతికి రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):



స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలోని రాజ్‌భవన్ (గవర్నర్ బంగ్లా)లో జరగనున్న కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితురాలిగా నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ పద్మశ్రీ ఎర్రాజీ జ్యోతికి ఆహ్వానం అందింది. ఆగస్టు 15న సాయంత్రం ఐదు గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎర్రాజి జ్యోతితో పాటు విశాఖకు చెందిన పద్మశ్రీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అంతర్జాతీయ స్కేటర్ దొంతర గ్రీష్మ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు. ఈ మేరకు వారికి సమాచారమివ్వాలని జిల్లా కలెక్టర్‌కు రాజ్‌భవన్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

16న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

తగరపువలస, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సంతపేట రామాలయంలో ఈ నెల 16న (శనివారం) సాయంత్రం 3 గంటల నుంచి 'బాల గోకులం' పేరుతో శ్రీకృష్ణ వేషధారణ పోటీలను నిర్వహిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులను ప్రథమ విభాగం, 3 నుంచి 6 సంవత్సరాల లోపు వారిని ద్వితీయ విభాగం, 6 నుంచి 9 సంవత్సరాల లోపు బాలబాలికలను తృతీయ విభాగంగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే వారు మేకప్‌తో వేదిక మీదకు రావాలన్నారు. ప్రతివారికి ఒక నిమిషం నుంచి రెండు నిమిషాలు మాత్రం సమయం కేటాయిస్తామని అన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామని పాల్గొనే వారు 16వ తేదీలోగా రామాలయం వేదిక వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర యోగా పోటీలకు 9 మంది విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు భీమిలి ది సన్ స్కూల్ విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికయ్యారు. మంగళవారం ఆ స్కూల్‌లో ఎంపికైన విద్యార్థులను ఆ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 10న నగరంలోని సీతమ్మధార శ్రీకృష్ణ మందిరంలో విశాఖ యోగా స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో తమ విద్యార్థులు కె.రోహిత్, ఎ.వెన్నెల, బి.కోమలి, కె.అవినాష్, ఇ.శశిధర్, ఎ.లోహిత్, సీహెచ్.నీహారిక, ఆర్.తనూజ, కేవీ శివానందులు వివిధ విభాగాల్లో పలు స్థానాలలో విజేతలుగా నిలిచారన్నారు. వీరు సెప్టెంబరు 6, 7 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరగబోయే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులు, తర్ఫీదు ఇచ్చిన యోగా టీచర్ లక్ష్మిని డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.


తలంబ్రాలను చూపుతున్న అర్చకులు

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం

సింహాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధి గా పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలుచేసి షోడశోపచారాలు సమర్పించాక శాస్త్రీయ విధానంలో కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి సింహాచలానికి చెందిన జీబీ ఏకే చైతన్య రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో అన్నప్రసాద విభాగ ఏఈవో వి.రమణమూర్తి, పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావులకు అందజేశారు.

కొనసాగుతున్న అప్పన్న ఆభరణాల తనిఖీ


ఆభరణాలు తనఖీలు చేస్తున్న అధికారులు

సింహాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి సమర్పించిన స్వర్ణ, రజిత ఆభరణాల్లో తేడాలున్నాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రారంభమైన తనిఖీల ప్రక్రియ మూడోరోజు కొనసాగించారు. తొలిరోజు ఆలయ పద్యనిధి, రెండో రోజు ఆభరణాల ప్రదర్శన శాల, మూడో రోజు దేవాలయంలో ప్రతిరోజు అర్చనాదులకు వినియోగించు పుత్తడి, రజిత ఆభరణాలను తనిఖీ చేశారు. ఫైవ్ మన్ కమిటీకి సారథ్యం వహిస్తున్న అరసవల్లి ఈఓ కేవీఎన్‌డీవీ ప్రసాద్ మాట్లాడుతూ జాబితా ప్రకారం సరిచూసుకుని, తూనికలు వేశామని, మొత్తం ఆభరణాల తనిఖీకి మరింత సమయం పడుతుందన్నారు.

గీతంలో ముగిసిన ఎఫ్‌డీపీ

సాగర్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్‌ఇంజనీరింగ్ విభాగం ఐఐటీ గౌహతిలోని ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా ఇంజనీరింగ్ రంగంలో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనాలుఅనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డీపీ) మంగళవారంతో ముగిసింది.


తగరపువలస : సంతపేట హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు అందించిన వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు


ఆనందపురం : నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న వైద్య సిబ్బంది


భీమునిపట్నం : చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేస్తున్న నూకరాజు, వైద్య సిబ్బంది

పాఠశాలల్లో డీ వార్మింగ్ డే

- విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసిన వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

భీమునిపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎగువపేట అంగన్‌వాడీ మెర్జింగ్ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులి పురుగుల వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. నులిపురుగులు ప్రేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులను, ఈ వ్యాధి అస్కారియాసిస్ అంటారని, దీనివల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, విరోచనాలు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతికుమారి, అచ్యుతాంబ, రామలక్ష్మి, ఆశా వర్కర్లు మీనాకుమారి, నందిని, సీత, కొండమ్మ పాల్గొన్నారు.

తగరపువలసలో..

తగరపువలస, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస సమీపం సంతపేట వద్ద అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం డీ వార్మింగ్ డే నిర్వహించారు. స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ కె.సుస్మిత ఆధ్వర్యంలో పిల్లలకు నులి పురుగులు ఏ విధంగా ఉంటాయి.. వాటి వల్ల ఆరోగ్యానికి ఎటువంటి నష్టం వస్తుందన్న విషయాలను వివరించారు. అనంతరం ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజరు వై.హరి, ఆశా వర్కర్లు కుసుమకుమారి, కె.విమల తదితరులు ఈ మాత్రలను నమిలి మింగాలని విద్యార్థులకు అందించి వేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగన్నాథస్వామి, ఉపాధ్యాయులు అప్పలరాజు, సత్యలక్ష్మి, బలరాం, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో..

ఆనందపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారవుతారని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి ఎస్.భాను పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నులుపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంభీరం పంచాయతీ మండల పరిషత్ పాఠశాలను వైద్య సిబ్బంది సందర్శించి నులిపురుగుల వలన కలిగే ప్రమాదం, ఆరోగ్య పరిరక్షణ గురించి విద్యార్థులకు వివరించారు.

ఆల్బెండజోల్ మాత్రలను వాడటం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను హెచ్‌ఎం యూవీవీ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకల కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

పద్మనాభం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఇందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి మద్దిలో నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకల కరపత్రాలను మంగళవారం ఎంవీపీలోని క్యాంపు కార్యాలయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఈనెల 16 నుంచి 11 రోజుల పాటు శ్రీకృష్ణుడు విగ్రహాన్ని నిలిపి అనంతరం ఈనెల 26న ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటాను ఆహ్వానించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, అఖిల భారత అయ్యప్ప సేవా సమితి ప్రచార కార్యదర్శి తాతినాయుడు, జీపీ నాయుడు, ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు, కృష్ణ సూరప్పడు, సురేష్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం


ఫుట్‌బాల్ క్రీడాకారులతో నార్త్ ఏసీపీ అప్పలరాజు

భీమునిపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో కలిగొట్ల స్నిగ్ధశ్రీ జయంతిని పురస్కరించుకుని నాలుగు రోజులు నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఆహ్వాన ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామ్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు.. భీమిలి, కొమ్మాది తొలి మ్యాచ్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

బాలబాలికలు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్


విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న హరేంధిరప్రసాద్

కొమ్మాది, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలన కోసం ఏడాది నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం మారికవలస ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు,పాఠశాలలకు వెళ్లని వారికి నులిపురుగుల నిర్మూలనకు గాను ఆల్బెండజోల్ మాత్రలను అన్ని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం గురుకుల పాఠశాలలో గల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడ తొలగింపునకు ఆదేశం


గోడను పరిశీలిస్తున్న జడ్సీ కనకమహాలక్ష్మి, తదితరులు

మధురవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధి ఆదిత్యనగర్‌లో రహదారికి అడ్డంగా ఓ బిల్డర్ నిర్మించిన గోడను తొలగించాలని జోన్-2 జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆదిత్యనగర్‌లో ఒక బిల్డర్ రహదారికి అడ్డంగా గోడ కట్టడంతో కాలనీవాసులుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు ఆదిత్యనగర్ వాసులు గోడ తొలగించాలని కోరుతూ దరఖాస్తు పెట్టారు. దీనిపై స్పందించిన జడ్సీ, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మంగళవారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అపార్ట్‌మెంట్లకు సంబంధించిన లేఅవుట్ ప్లాన్‌ను పరిశీలించి గోడను తొలగించాలని జడ్సీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆదిత్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్ఎస్ నాయుడు, నాగోతి సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన సమస్యలపై పోరాడతాం'

సింహాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న గిరిజనుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామని పలువురు గిరిజన నేతలు ముక్తకంఠంతో ప్రకటించారు. ప్రపంచ ఆదివాసీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహగిరికి చెందిన గిరిజనులు కొండదిగువన గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పాత అడవివరం కూడలి నుంచి సింహాచలం తొలి పావంచా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్థానిక ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో పలువురు గిరిజన నేతలు మాట్లాడుతూ గిరిజనులందరూ తమ హక్కులపై కనీస అవగాహనను పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసంప్రతిఒక్కరూ తప్పనిసరిగా అక్షరాస్యులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాసు, గిరిజన కాలనీల నాయకులు అంబడి రాజయ్య, గడ్డం సన్యాసిరావు, జానకిరామ్ పాల్గొన్నారు.

ఉక్కు విద్యాలయాలకు చిక్కులు

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యం యత్నించింది. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కల్పించుకొని ఆ ఏడాదికి సాయం ఇప్పించారు. ఈ ఏడాది కూడా విద్యా శాఖ నుంచి అనుమతి కావాలంటే...యాజమాన్యం భవనం లీజు అగ్రిమెంట్‌ను డయసిస్‌కు ఇవ్వాలి. దానిని జిల్లా విద్యా శాఖాధికారికి సమర్పిస్తే అనుమతి లభిస్తుంది. అయితే స్టీల్ యాజమాన్యం విద్యా సంస్థను మూసేయాలనే ఉద్దేశంతో ఒప్పందం చేయలేదు. దాంతో అనుమతి రాలేదు. ఈ నేపథ్యంలో నిర్వహణ సంస్థ కోర్టును ఆశ్రయించినట్టు తెలిసింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావడం, పాఠశాలలు తెరవకపోవడం, గొడవలు జరగడంతో విద్యార్థులను తల్లిదండ్రులు వేరే పాఠశాలల్లో చేర్పించేశారు. మరికొంతమంది మాత్రం పాఠశాల తెరిస్తే చేరుదామని వేచి ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయం పరిస్థితీ అంతే!

స్టీల్ ప్లాంటు, సీఐఎస్ఎఫ్, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లల కోసం 70 ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు క్లాసులు ఉన్నాయి. వేయి మంది విద్యార్థుల ఉన్నారు. బోధన సిబ్బంది మాత్రం అందుకు తగినట్టుగా లేరు. సగం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.దీని నిర్వహణను కూడా స్టీల్ ప్లాంటుయాజమాన్యం భారంగా భావిస్తోంది. గత ఏడాదే ఒకటో తరగతి, 11వ తరగతి (ప్లస్ వన్)అడ్మిషన్లు ఆపేసింది. ఈ ఏడాది కూడా అలాగే చేసింది.

దాంతో తరగతులు తగ్గిపోయాయి. ఈ ఏడాది ప్లస్ టు చదువుతున్న విద్యార్థులు వెళ్లిపోతే ఇకపై పదో తరగతి వరకే ఉంటుంది. గత ఏడాది ఒకటో తరగతి అడ్మిషన్లు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది రెండో తరగతికి వచ్చేవారు ఎవరూ లేరు. ఈ ఏడాది కూడా ఒకటో తరగతికి ఎవరినీ తీసుకోలేదు. అంటే రెండు తరగతులు తగ్గిపోయాయి. క్రమంగా దీనిని కూడా మూసేయాలనేది యాజమాన్యంవ్యూహంగాచెబుతున్నారు.

అబద్ధాల సృష్టి!

... 5వ పేజీ తరువాయి

గుర్తించలేకపోయి ఎనట్టు చెబుతున్నారు. ఇకపోతే, ఇప్పటి వరకు విశాఖ కేంద్రంలో పనిచేసిన ముగ్గురు వైద్యులు, నలుగురు దళారులను అరెస్టు చేశారు. మరికొందరిని అరెస్టు చేసే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో అరెస్టు అయిన డాక్టర్ విద్యుల్లత పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేవారు. డాక్టర్ ఉషాదేవి ప్రసవాలకు సంబంధించి విషయాలను చూసేవారు. వీరికి డాక్టర్ నమ్రతతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్టు చెబుతున్నారు. డాక్టర్ వాసుపల్లి రవి అనస్థీషియాకు సంబంధించిన సేవలను అందించారు.

రియల్టర్ దామా సుబ్బారావు అరెస్టు

కూర్మన్నపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు తొలగించడంతో పాటు రహదారి నిర్మాణం చేపట్టారన్న అభియోగంపై రియల్టర్, రాజకీయ నాయకుడు దామా సుబ్బారావును మంగళవారం దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కూర్మన్నపాలెం సర్వే నంబరు 47లో గల 250 చదరపు గజాల ప్రభుత్వ భూమిని సుబ్బారావు ఆక్రమించి మెటల్ రోడ్డు వేస్తుండడంతో వీఆర్ఓ బీసీ శేషగిరిరావు రాత పూర్వకంగా మంగళవారం గాజువాక తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు.తహశీల్దార్ బి.శ్రీనివాసరావు ఈ విషయమై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నించడంతో ఈ ఏడాది మార్చి 21న బోర్డు ఏర్పాటుచేశామని, దాని జోలికి వెళ్లొద్దని హెచ్చరించామని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదుచేసి దామా సుబ్బారావును అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి కోర్టులో హాజరుపరచగా, రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసిన సర్వే నంబర్లపై హైకోర్టులో కేసులు ఉన్నాయని, ఆయన తరపు లాయర్లు న్యాయాధికారికి తెలియపరచారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ మంజూరైంది. కాగా, దామా సుబ్బారావు వైసీపీలో ఉండేవారు. గత ప్రభుత్వ హయాంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. గత ఏడాది కాలంగా వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రేపో మాపో ఆయన బీజేపీలో చేరతారని ప్రచారం ఉంది.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల ఆందోళన

భీమునిపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్లు ఆందోళన చేపట్టారు. భోజన విరామ సమయంలో వీరు కళాశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి డిగ్రీ కళాశాలల్లో బదిలీలను వెంటనే చేపట్టాలని, జీవో నంబరు 42 రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని నినాదాలు చేశారు. ఈనెల 14 వరకూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, 18న ఛలో విజయవాడ ధర్నా ఉంటుందన్నారు.

హమ్మయ్య.. బయటపడ్డారు

- సరియా జలపాతం అవతలి వైపు చిక్కుకున్న 31 మంది పర్యాటకులు
- తిరిగి వస్తుండగా ఉధృతంగా ప్రవహించిన గెడ్డ
- రోప్ సాయంతో సురక్షితంగా తీసుకువచ్చిన పోలీసులు, వలంటీరు


పర్యాటకులను సురక్షితంగా తీసుకువచ్చిన పోలీసులు, వలంటీర్లు

అనంతగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సరియా జలపాతం ఆవలి వైపు అందాలను తిలకించేందుకు వెళ్లిన 31 మంది పర్యాటకులు వరదల్లో చిక్కుకున్నారు. ఎగువ నుంచి వచ్చిన నీటితో జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో అక్కడే ఉండిపోయారు. విషయం తెలిసి పోలీసులు, వలంటీర్లు వారిని సురక్షితంగా చేర్చారు. వివరాలు ఇలా వున్నాయి. విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లికి చెందిన పర్యాటకులు మంగళవారం సరియా జలపాతాన్ని చూసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం అవతలి వైపు తిలకించేందుకు గెడ్డ దాటి వెళ్లారు. కొందరు వెంటనే వచ్చేశారు. మిగిలిన 31 మంది పర్యాటకులు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇటు వైపు వచ్చేందుకు బయలుదేరగా, ఎగువన భారీ వర్షం కురవడంతో గెడ్డ పొంగి ప్రవహించింది. దీంతో చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న దేవరాపల్లి, చీడికాడ, అనంతగిరి ఎస్ఐలు సత్యనారాయణ, సతీశ్, శ్రీనివాసరావు, వలంటీర్లు మహేశ్,రాజు, రాము, టీడీపీ నాయకుడు సురేశ్ అక్కడికి చేరుకుని, తాడు సహాయంతో పర్యాటకులను సురక్షితంగా తరలించారు.

కనకమహాలక్ష్మి దేవస్థానంలో వెండిపై వివాదం

... 5వ పేజీ తరువాయి

ఈ తరహా బదలాయింపులు నిబంధనలకు విరుద్ధమని అధికారులే చెబుతున్నారు.

కమిషనర్ అనుమతి లేకుండా చేయలేరు

దేవస్థానాలకు వచ్చిన బంగారు, వెండి వస్తువులను ఏమైనా మార్పిడి చేయాలంటే...అందుకు ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి తీసుకోవాలి. ఆ వస్తువులను ప్రభుత్వానికి చెందిన మింట్‌కు పంపి, అక్కడే కరిగించాలి. ఇదంతా పెద్ద ప్రక్రియ. ఇలాంటివి ఎప్పుడో గానీ జరగవు. కనకమహాలక్ష్మి ఆలయంలో అంతా నోటిమాటలతో జరిగిపోయింది. కొత్తది 60 కిలోలు కావాలని, పాతది సుమారు 34 కిలోలు ఉంటుందని, మిగిలిన వెండి దాతల ద్వారా సమకూరుస్తామని హామీ ఇచ్చినట్టు చెబుతున్నారు. అవేవీ చేతికి రాక ముందే అమ్మవారికి ఆయన కొత్త తాపడం చేయించి ఇచ్చేశారు. దాంతో అధికారులకు పాత వెండి ఇవ్వాలనే ఆసక్తి పోయింది. ఆ తరువాత ఈఓలు ఒక్కొక్కరిగా మారిపోయారు. ఇటీవల ఆలయంలో ఒక వర్గం మరో వర్గానికి చెందిన వారిని ఇరికించాలనే ఉద్దేశంతో వెండి వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి (జేవీఓ) వల్లంరాజు ఇటీవల విచారణ చేశారు. ఈలోగా ఆయనకు సింహాచలం దేవస్థానం ఆభరణాలు లెక్క తేల్చే పని అప్పగించడంతో అటు వెళ్లారు. దాంతో ఇక్కడ లెక్కలు మధ్యలో ఆగిపోయాయి.

డీసీ విచారణ చేస్తున్నారు

కె.శోభారాణి, ఈఓ, కనకమహాలక్ష్మి దేవస్థానం

అమ్మవారి వెండి తాపడంపై ప్రముఖ దాత ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. దానిపై డిప్యూటీ కమిషనర్ విచారణ చేస్తున్నారు. అయితే ఆలయంలో పాత తాపడం, కొత్త తాపడం రెండూ ఉన్నాయి, నష్టం ఏమీ జరగలేదు. కాకపోతే రశీదులు లేవు.

ట్యాంకర్ల టెండర్లలో కాంట్రాక్టర్ల రింగ్

... 5వ పేజీ తరువాయి

మొత్తం పది ట్యాంకర్ల ఏర్పాటుకు సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో ఐదు వర్కులుగా విభజించి ఇటీవల టెండర్లు పిలిచారు. బిడ్ దాఖలుకు ఈనెల 11 తుది గడువుగా పేర్కొన్నారు. ఇప్పటికే వాటర్ ట్యాంకర్లను తిప్పుతున్న వారితోపాటు కొత్తగా ఆ వ్యాపారంలోకి రావాలనుకుంటున్నవారు కూడా టెండరులో పాల్గొనాలని భావించారు. అయితే జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలో కీలకంగా వ్యవహరిస్తున్న నేత ఒకరు రంగంలోకి దిగారు. తనకు అత్యంత ఆప్తులైన కాంట్రాక్టర్లకు ఆయా వర్కులను కట్టబెట్టేందుకు వ్యూహం అమలు చేశారు. టెండరులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేయాలని ఆదేశించారు. ఆసక్తి ఉన్న వారందరికీ ఒక్కో వర్కు చొప్పున లాటరీ ద్వారా కేటాయిస్తానని, దీనివల్ల లెస్‌లు తగ్గి కాంట్రాక్టర్లకు మేలు జరుగుతుందని వివరించారు. దీంతో ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు గ్రూపులో మెసేజ్ చేయగా వారందరితో ఈనెల పదిన యూనియన్ కార్యాలయంలో సమావేశం పెట్టారు. ఆ సమయంలో ఎవరికి ఏ వర్కు కేటాయిస్తున్నామనేది చెప్పి, మిగిలిన వారికి తర్వాత ఏదో ఒక వర్కు ఇస్తామన్నారు. వర్కును ఎవరికి కేటాయిస్తున్నామో వారు మాత్రమే రెండు, మూడు శాతం లెస్‌కు బిడ్ వేయాలని, మరో ఇద్దరు కాస్త ఎక్కువకు డమ్మీ బిడ్లు వేస్తారని స్పష్టంచేశారు. దీనివల్ల సింగిల్ బిడ్ అనే కారణంతో టెండరుని రద్దు చేయడానికి వీలుండదనేది యూనియన్ నేత ఉద్దేశం. కొంతమంది కాంట్రాక్టర్లు యూనియన్ నేత ప్రతిపాదనకు నిరాకరించి, తాము బిడ్ వేస్తామని స్పష్టం చేయగా, వారి ఎదురుగానే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడతానని చెప్పి కాల్ చేశారు. తాను చెప్పినవారు కాకుండా ఇంకెవరైనా బిడ్ వేస్తే వారిని అనర్హులుగా పక్కనపెట్టేయాలని చెప్పగా, అటు వైపు నుంచి అధికారులమని చెప్పినవారు కూడా అలాగే చేస్తామని చెప్పడంతో చాలామంది కాంట్రాక్టర్లు ఎందుకొచ్చిన గొడవని వెనకడుగు వేశారు. ఒకరిద్దరు మాత్రం ఏదైతే అదే జరుగుతుందని చెప్పి సొంతంగా బిడ్ వేశారు. సోమవారం బిడ్ దాఖలకు ఆఖరుతేదీ కాగా, అదేరోజు టెక్నికల్ బిడ్‌ను అధికారులు తెరిచినట్టు తెలిసింది. కాంట్రాక్టర్ల సంఘం నేత బెదిరింపులకు కాంట్రాక్టర్లు భయపడిపోవడంతో నీటిసరఫరా ట్యాంకర్ల టెండర్లు అన్నీ పది శాతంలోపే లెస్‌లకు వెళతాయని కాంట్రాక్టర్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల కాంట్రాక్టర్ల మధ్య పోటీ తగ్గిపోయి జీవీఎంసీ ఖజానాకు నష్టం వాటిల్లనున్నది.

మారని ఏయూ తీరు!

... 5వ పేజీ తరువాయి

ప్రాక్టికల్స్ నిర్వహించే బాధ్యతను ప్రభుత్వ కాలేజీలకు మాత్రమే అప్పగించాలని నిర్ణయించారు. అయితే, ఆ దిశగా ఇప్పటివరకూ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో మరోసారి ప్రైవేటు కాలేజీలకే ప్రాక్టికల్స్ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఈ విధంగా ఆయా కాలేజీలు భారీగా దండుకునే అవకాశాన్ని వర్సిటీ అధికారులు కల్పిస్తున్నారు.

వసూళ్లే లక్ష్యం..

ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి భారీగా వసూలు చేసేందుకు ఎగ్జామ్ సెంటర్ల నిర్వహకులు సిద్ధమవుతున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి మూడు వేల నుంచి ఐదు వేల రూపాయల వరకూ వసూలు చేయనున్నట్టు చెబుతున్నారు. విద్యార్థులు చెల్లించే మొత్తాన్ని బట్టి తరగతులకు, ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సిన అవసరం లేకుండానే సదరు కాలేజీ యాజమాన్యాలు తతంగం నడిపిస్తాయి. గతంలో దూర విద్య పరీక్షలకు సంబంధించిన ప్రాక్టికల్స్‌ను ప్రభుత్వ కాలేజీల్లోనే నిర్వహించేవారు. ఆ తరువాత ప్రైవేటు కాలేజీలకు అప్పగించారు. ప్రైవేటుకు మార్చిన తరువాత ప్రాక్టికల్స్ ప్రక్రియ తూతూమంత్రంగా సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో వర్సిటీ ఆదాయానికి గండి పడుతోంది. ప్రాక్టికల్స్ నిర్వహణకు వర్సిటీ నుంచి ఆయా కాలేజీలకు కొంత మొత్తాన్ని చెల్లిస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.50 వేలు నుంచి రూ.3 లక్షల వరకూ యూనివర్సిటీ చెల్లిస్తుంది. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు, సక్రమంగా ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ప్రభుత్వ కాలేజీలకు ఈ బాధ్యతలను అప్పగించడం ముఖ్యమని పలువురు సూచిస్తున్నారు. మరోవైపు దూరవిద్య కేంద్రంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులను మార్చాలని వైస్ చాన్సలర్ భావించారు. ముఖ్యంగా కోర్సులు నిర్వహించని విభాగాలకు చెందిన వారిని వెనక్కి పంపించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఫైల్ కూడా రెడీ చేశారు. కొందరు అధికారులు సంతకాలు కూడా పూర్తయ్యాయి. మళ్లీ ఏమైందో తెలియదు గానీ సదరు సిబ్బందిని అక్కడే కొనసాగిస్తున్నారు. దీనివెనుక మర్మమేమిటో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఏళ్ల నుంచి పాతుకుపోయిన ఉద్యోగులను మారిస్తే దూర విద్య ప్రక్షాళన సాధ్యమవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

హెచ్‌బీ కాలనీలో మ్యాన్‌హోల్ కష్టాలు

» తరచూ పొంగుతుండడంతో రోడ్డుపైకి మురుగు



సింహాద్రిపురం రిజర్వాయర్ పంపుహౌస్ వద్ద పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్

వెంకోజీపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఏరులా పారుతున్న ఈ నీటిని చూసి వర్షం నీరు వరదలా పారుతుంది అనుకుంటే భ్రమపడినట్టే... ఇది 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీలో గల సింహాద్రిపురం మంచినీటి పంపుహౌస్ వాటర్ ట్యాంకు వద్ద పొంగి పొర్లుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్. ఎప్పటికప్పుడు ఈ ప్రాంతంలోని కొండవాలు ప్రాంతం నుంచి వస్తున్న మురుగునీరు మేన్‌హోల్ ఇక్కడ పొంగిపొర్లుతుంటుంది. దీంతో ఈ రోడ్డుపై నడిచేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ అంతగా పొంగి పొర్లుతుండగా ఈ మార్గంలో అండర్‌గ్రౌండ్ మరమ్మతుల కోసం తవ్విన గోతులు అలానే వదిలేయడం వల్ల ఈ మార్గమంతా గోతులమయంగా మారింది. అయితే మురుగునీరు ప్రవాహం, లేకపోతే గోతులమయం. దీనివల్ల ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా దీనికి సమీపంలోని పాఠశాల కూడా ఉందని, ఆ కళాశాల విద్యార్థులు ఈ మార్గంలో రాకపోకలు సాగించేదుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'దేశాభివృద్ధిలో యువత భాగం కావాలి'



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ వీసీ, అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధిలో యువత భాగం కావాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ పరిపాలనా భవనం వద్ద మంగళవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశభక్తిని కలిగి ఉండటం, కలిసి పనిచేయడం, వికసిత్ భారత్ లక్ష్యాలను సాకారం చేసే దిశగా కృషిచేయడం ఎంతో అవసరమన్నారు. యువత తమ మేధస్సును నూతన ఆవిష్కరణలు, దేశాన్ని సాంకేతిక, ఆర్థిక రంగాల్లో అత్యున్నత స్థానాల్లోనిలపడానికి వినియోగించాలని సూచించారు.స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు పోగొట్టుకున్న దేశభక్తులను గుర్తు చేసుకోవడం, వారి స్ఫూర్తితో దేశాభ్యున్నతికి పాటు పడటం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్ జి.గిరిజాశంకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వార్మింగ్ డే



చిన్నారులకు మాత్రలు వేస్తున్న సీతారాం

వెంకోజీపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) :పిల్లల్లో నులిపురుగుల వలన అనేక శారీరక రుగ్మతలు సంభవిస్తాయని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ సెక్టార్-4లోని 16వ వార్డు రజకవీధి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమంలో సీతారాం పాల్గొని పిల్లలకు మాత్రలను వేశారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన

మద్దిలపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : యువతీయువకుల్లో అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన సాధ్యమని జిల్లా అదనపు వైద్యఆరోగ్యాధికారి రోణంకి రమేష్ చెప్పారు. అంతర్జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఐవీ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తగు జాగ్రత్తలు తీసుకుంటే హెచ్‌ఐవీ సోకే ప్రమాదం తప్పుతుందన్నారు.

సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు దిశగా కృషి చేయాలి

» యూఎన్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఫర్ ఇండియా-భూటాన్ డైరెక్టర్ డారిన్ ఫారెంట్



సమావేశంలో మాట్లాడుతున్న డారిన్ ఫారెంట్, వేదికపై ఏయూ వీసీ రాజశేఖర్ తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాకారం చేసే దిశగా యువత కృషి చేయాలని యునైటెడ్ నేషన్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఫర్ ఇండియా-భూటాన్ డైరెక్టర్ డారిన్ ఫారెంట్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏయూ ఎకనామిక్స్ విభాగం ఆగ్రోఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్, ఎస్ వుయ్ కెన్ సంస్థ, కింగ్స్ కళాశాల పూర్వపు విద్యార్థుల సంఘం సంయుక్తంగా మంగళవారం ఏయూలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడం, సాకారం చేయడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందన్నారు. సమాజంలో మనుషులంతా సమానంగా జీవించాలని, ఆహారం లేకుండా ఎవరూ చనిపోకూడదని అన్నారు. సమాజం మార్పునకు యువత కేంద్రంగా నిలవాలన్నారు. ఏయూ వైస్ ఛాన్సలర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్య దిశగా యువత ఆలోచించడం, పని చేయడం ఎంతో అవసరమన్నారు. వైవిధ్య సంస్కృతులు పరస్పరం అందిపుచ్చుకోవడం, గౌరవించుకోవడం ఎంతో అవసరమన్నారు.

మద్దిలపాలెం డిపో ఎదుట ఎన్ఎంయూఏ ధర్నా

» వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



మద్దిలపాలెం డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, కార్యకర్తలు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలనిడిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) మంగళవారం మద్దిలపాలెం డిపో ఎదుట ధర్నా నిర్వహించింది. ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు అప్పగించడం, కొన్ని డిపోలను తరలించేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను విడనాడాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీని వెంటనే వేయాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని, పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ ఇవ్వాలని అనారోగ్యంతో బాధపడుతున్నఉద్యోగులను గుర్తించి వారికి అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ మీద నియామకాలు జరపాలనిడిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఎన్‌ఈ రావు, కార్యదర్శి పి.చిన్నా రీజనల్ నాయకులు, డిపో నాయకులు పాల్గొన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర రావు ధర్నా వద్దకు వచ్చి అసోసియేషన్‌కు మద్దతు ప్రకటించారు.

ఏనుగుల సంరక్షణపై చర్చా వేదిక



జూలో నిర్వహించిన అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఏనుగులను కాపాడే బాధ్యత మనందరిపైనఉన్నదని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ జి.మంగమ్మ అన్నారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జూలో ఏనుగుల సంరక్షణపై చర్చా వేదిక, విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడి జూ పార్కులో కృష్ణ, రాజు, సరస్వతి, లక్ష్మి అనే నాలుగు ఆసియాటిక్ జాతికి చెందిన ఏనుగులు ఉన్నయని, వీటి సంరక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జూ వైద్యురాలు డాక్టర్ భాను ఏనుగుల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులనుప్రదానం చేశారు. కార్యక్రమంలో జూఅసిస్టెంట్ క్యూరేటర్ పి.చౌదరి,సెక్షన్ అధికారులుపాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

» సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సిరిపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, టీడీపీ ఎంపీలు మిట్టల్ ఊడిగం చేయడం ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌లకు కేంద్రం సొంత గనులు కేటాయించిందని, విశాఖ ప్లాంట్‌పై వివక్ష చూపిస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు కాబోయే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ఎండీసీ నుంచి గనుల కేటాయింపు, పైపులైన్ల ద్వారా సరఫరాకు అనుమతులు వేగవంతం చేయాలని ఎంపీ శ్రీభరత్, తెలుగుదేశం ఎంపీల బృందం ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. అధికారమిస్తే విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధించి, ప్లాంటును లాభాలబాట పట్టిస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చి, ఇప్పుడు మాటతప్పడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రజల కన్నా మిట్టల్ ముఖ్యమైతే విశాఖ ఎంపీ, టీడీపీ ఎంపీలు పదవులకు రాజీనామా చేసి ప్రజా తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగన్, కృష్ణారావు, కుమార్, మణి, రాజు, చలపతి, తదతరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తోపుడుబండ్ల వ్యాపారుల నిరసన



నినాదాలు చేస్తున్న తోపుడుబండ్ల వ్యాపారులు

మద్దిలపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చిరువర్తకుల పొట్టకొట్టడానికే కళాభారతి రహదారిలో ఫుట్‌పాత్ నిర్మాణం చేస్తున్నారని కళాభారతి తోపుడుబండ్ల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్, కార్యదర్శి నసీరునిషా విమర్శించారు. కళాభారతి రోడ్డులో ఫుట్‌పాత్ నిర్మాణాలను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చిరువర్తకులు కళాభారతి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ వ్యాపారాలు తొలగించడానికి వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ఆక్రమణలను హైకోర్టులో కేసువేసి తోపుడు బండ్లు మొత్తం తొలగించారన్నారు. మేం కోర్టుకెళ్లి యథావిధిగా వ్యాపారాలు నిర్వహించుకోవడానికి స్టేటస్ కో ఆర్డర్ తెచ్చుకున్నామన్నారు. అయినప్పటికీ ఏదో విధంగా మా పొట్టకొట్టాలన్న కక్షతోనే కళాభారతి రోడ్డులో ఫుట్‌ఫాత్ ప్రతిపాదనలు చేసి నిర్మాణం చేయిస్తున్నారన్నారు. శివాజీపాలెం వెళ్లేందుకు నాలుగు రహదారులు ఉండగా కేవలం కళాభారతి రోడ్డులో మాత్రమే ఫుట్‌పాత్ నిర్మాణం చేయడమేంటని ప్రశ్నించారు. జీవీఎంసీ ఎన్నికల్లో ఆయన వెనుక తిరిగి గెలిపించామన్నారు. ఇప్పుడు మాకు ఆయన చేస్తున్న అన్యాయాన్ని నిలదీస్తే వైసీపీ వాళ్లమని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వార్డు ప్రజలను హింసిస్తున్న కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి : ఏయూ వీసీ

విశాఖపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్‌కు యువత దూరంగా ఉండాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ సూచించారు. ఏయూ పరిపాలనా భవనం నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు మంగళవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే తీవ్ర పరిణామాలు, శిక్షలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. యువత సామరస్యంగా మెలగాలని సూచించారు. ర్యాగింగ్‌లు వంటి అల్లరి చేష్టలకు పాల్పడకుండా జ్ఞానసముపార్జనపై దృష్టి సారించాలన్నారు.

మేయర్‌ను కలిసిన స్థాయీ సంఘం సభ్యులు



మేయర్‌ను కలిసి సన్మానిస్తున్న స్థాయీ సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఎన్నికైన స్థాయీ సంఘం సభ్యులు నగర మేయర్ పీలా శ్రీనివాసరావును మంగళవారం పెందుర్తి మేయర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అంతా విశాఖ నగరాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, స్థాయీ సంఘంలో ప్రతి అంశం అభివృద్ధి కోసమే ప్రాధాన్యమిస్తూ క్షుణ్ణంగా చర్చ జరిగేలా చూడాలని సూచించారు. మేయర్‌ను కలిసిన వారిలో స్థాయీ సంఘం సభ్యులు కొణతాల నీలిమ, గంకల కవిత, దాడి వెంకట రామేశ్వరరావు, సేనాపతి వసంత, గేదెల లావణ్య, రాపర్తి త్రివేణి వరప్రసాద్, మాదంశెట్టి చినతల్లి, మొల్లి ముత్యాలు, తెలుగుదేశం పార్టీ నాయకులు మొల్లి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

విశాఖ సమగ్రాభివృద్ధికి ఉధృత పోరాటం

» సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ సమగ్ర అభివృద్ధికి ఉధృత పోరాటం చేస్తామని, పార్టీ 28వ రాష్ట్ర మహాసభలు ఈనెల 23 నుంచి ఒంగోలులో జరగనున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ తెలిపారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు చేయాల్సిన పోరాటాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బీచ్‌రోడ్డులో రూ.వందల కోట్లు విలువైన 13.74 ఎకరాల ప్రభుత్వభూమిని లూలుకు కేటాయించడం సరికాదని, తక్షణం ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని డిమాండ్ చేసారు. విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయింపుపై ఎంపీలు పట్టించుకోవడంలేదని, నక్కపల్లిలో నిర్మిస్తున్న మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని ఏడుగురు ఎంపీలు ఉక్కు మంత్రికి విజ్ఞప్తి చేయడం దారుణమన్నారు. విశాఖ రైల్వేజోన్‌కు భూమి పూజతోనే సరిపెట్టేశారని, తక్షణం రూ.9,138 కోట్లతో నిర్మాణపనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విశాఖ మెట్రోకి 34 కిలోమీటర్ల కారిడార్ నిర్మిస్తామని చెబుతున్నారని, హైదరాబాద్, చెన్నై అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని వరదలను తట్టుకునేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, చంద్రశేఖర్, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో అవయవదానంపై అవగాహన సదస్సులు

వెంకోజీపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అవయవదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం మెడికవర్ హాస్పిటల్స్ అన్ని యూనిట్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో వైద్య నిపుణులు, ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొని ప్రజల్లో అవయవదానం ప్రాధాన్యంపై చైతన్యం కలిగించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఏడాది రెండు లక్షల మందికి పైగా రోగులు అవయవ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారని, అయితే చాలా తక్కువ మందికే అవయవాలు అందుతున్నాయన్నారు. అవగాహన లోపం, సంప్రదాయ అభిప్రాయాలు, కుటుంబాల భావోద్వేగ పరిస్థితులు ఈ లోటుకు కారణమవుతున్నాయన్నారు. మెడికవర్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ రవిశంకర్ కింజరపు మాట్లాడుతూ మనిషి జీవితానికి అవసరమైన చాలా వస్తువులను కృత్రిమంగా తయారు చేయగలుగుతున్నామని, కానీ అవయవాలను మాత్రం తయారు చేయడం సాధ్యం కాదని, అందువల్ల మరణించిన వారి అవయవాలను అవసరమైన వారికి దానం చేస్తే వారికి కొత్త జీవితం లభిస్తుందన్నారు.

ఫొటోగ్రఫీ డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, అసోసియేషన్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19న నిర్వహించనున్న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ పోస్టర్‌ను తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో 1400 మంది సభ్యులు ఉన్నారని అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ మధు తెలిపారు. ఈ నెల 19న నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన్ భవన్‌లో సాయంత్రం 6 : 30 గంటలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సంఘం సలహాదారు టీవీఆర్ఎం రాజు, ఎన్‌వీఎస్ ప్రసాద్, గంగాధర్, విజయ్, శ్రీరామ్మూర్తి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచి దైవ, దేశభక్తి అలవర్చుకోవాలి

» వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 101 గవర్నర్ ద్వారకానాథ్



వివిధ వేషధారణలో చిన్నారులు

సిరిపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చిన్ననాటి నుంచే దైవ, దేశభక్తి అలవర్చుకోవాలని తద్వారా ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుందని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 101 గవర్నర్ కె.ద్వారకానాథ్ పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి, స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో మంగళవారం ఆశీల్‌మెట్టలోని ఇస్కాన్ అనుబంధ విద్యా సంస్థ డివైన్ టచ్ పాఠశాలలో ప్రత్యేక వేషధారణ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ద్వారకానాథ్.. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నితాయ్ సేవిని మాతాజీతో కలిసి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు దైవభక్తికి చిహ్నంగా రాధ, గోపికలు, చిన్నికృష్ణుల వేషధారణల్లో.., మరి కొందరు చిన్నారులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశభక్తికి గౌరవంగా స్వాతంత్ర్య సమరయోధులు, సిపాయిల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు ప్రదానోత్సవం చేశారు.

'జ్ఞాన సముపార్జనపై దృష్టి సారించాలి'

విశాఖపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందినప్పటి నుంచి విద్యార్థులు తమ పూర్తి సమయాన్ని, దృష్టిని జ్ఞాన సముపార్జనపై ఉండాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ, ఎంబీఏ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మార్పు చెందుతున్న సాంకేతిక సమాజంలో మీరు ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఐదు సంవత్సరాల తరువాత ఏ స్థానంలో స్థిరపడాలనుకుంటున్నారో ఇప్పుడే నిర్ణయించుకొని ఆ దిశగా అవిశ్రాంతంగా కృషి చేయాలని సూచించారు. నేటి తరం చుట్టూ పోటీ ప్రపంచం ఉందని, విభిన్న సాంకేతికతలను జ్ఞానాన్ని సమన్వయం చేసుకుంటూ అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. సిబ్ డైరెక్టర్ జి.రాంబాబు మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమైన భవిష్యత్తు వ్యాపార నాయకత్వాన్ని అందించే వేదికగా స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ నిలుస్తుందన్నారు.

సినిమా గైడ్

● **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
● **కింగ్డమ్** : జగదాంబ
● **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
● **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లలిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
● **హరిహర వీరమల్లు** : శారద, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 26, పచ్చిమిర్చి 66, కాకరకాయలు 24, బీరకాయలు 24, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26,అల్లం (పాతది) 70, బరబాటి 26, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 36, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు: సీపీ



ఏవీఎన్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మహారాణిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో ర్యాగింగ్ రహిత వాతావరణం కోసం అందరూ కృషి చేయాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. రాష్ట్రంలో ఈనెల 12 నుంచి 18 వరకు యాంటీ ర్యాగింగ్ వీక్ సందర్భంగా ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు సమన్వయంతో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ జీడీ.బాబు ఆధ్వర్యంలో సుమారు 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో భారీ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని సీపీ ప్రారంభించారు. 'ర్యాగింగ్ వద్దు చదువే ముద్దు', 'ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు' అని నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. జగదాంబ మీదుగా పూర్ణామార్కెట్ నుంచి తిరిగి ఏవీఎన్ కళాశాలకలు చేరుకుంది. ఈర్యాలీలో డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ కాళిదాస్, వన్‌టౌన్ సీఐ జీడీ.బాబు, పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు మేయర్ పీలా అభినందనలు



మేయర్ పీలాతో కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జీవీఎంసీ నిర్వహించిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మెంబర్‌గా ఎన్నికైన 48వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు మంగళవారం నగరమేయర్ పీలా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు వారికి అభినందనలు తెలిపారు. గంకల కవిత మాట్లాడుతూ తమ వార్డులో అభివృద్ధికి సహకరించాలని మేయర్‌ను కోరారు.

15 నుంచి శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామా మాధవదాస

డాబాగార్డెన్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణ జన్మాష్టమి 2025 వేడుకలను గాదీ రాజు ప్యాలెస్‌లో 15, 16, 17 తేదీల్లో నిర్వహించనున్నామని హరేకృష్ణ మూమెంట్ విశాఖపట్నం ప్రతినిధులు శ్యామా మాధవ దాస తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధురవాడ, ఆనందపురం, భీమునిపట్నంలోని భక్తుల కోసం ఐఐఎం రోడ్డులోని గంభీరం గ్రామంలో కృష్ణ మందిర నిర్మాణం జరిగే ప్రదేశంలో వేడుకలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 వరకు స్వామివారిని దర్శనం చేసుకోవచ్చని అన్నారు. సమావేశంలో ప్రతినిధి యదురాజా దాస పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

అల్లిపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని నమరగంలోని సీపీఐ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్యా కార్యదర్శి యు.నాగరాజు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు బ్రిటీష్ తెల్ల దొరలను తరిమికొట్టేందుకు 1936లో ఉత్తరప్రదేశ్ లక్నోలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ పురుడు పోసుకుని నేటికి 90 సంవత్సరాలు పూర్తి చేసుకుందని అన్నారు. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి. శేఖర్ మాట్లాడుతూ కూటమి ఎన్నికల సమయంలో విద్యార్థుల కోసం ఇస్తామన్న హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అప్పన్న ఆభరణాల తనిఖీ



ఆలయంలో ఆభరణాలు తనఖీలు చేస్తున్న అధికారులు

సింహాచలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి సమర్పించిన స్వర్ణ, రజిత ఆభరణాల్లో తేడాలున్నాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రారంభమైన తనిఖీల ప్రక్రియ మూడోరోజు కొనసాగించారు. తొలిరోజు ఆలయ పద్యనిధి, రెండో రోజు ఆభరణాల ప్రదర్శనశాల, మూడో రోజు దేవాలయంలో ప్రతిరోజు అర్చనాదులకు వినియోగించు పుత్తడి, రజిత ఆభరణాలను తనిఖీ చేశారు. ఫైవ్‌మన్ కమిటీకి సారథ్యం వహిస్తున్న అరసవల్లి ఈఓ కేవీఎస్‌డీవీ ప్రసాద్ మాట్లాడుతూ జాబితా ప్రకారం సరిచూసుకుని, తూనికలు వేశామని, మొత్తం ఆభరణాల తనిఖీకి మరింత సమయం పడుతుందన్నారు.

డాక్టర్ కూటికుప్పలకు సోదర వియోగం



సోదరుడి మృతదేహం వద్ద విలపిస్తున్న డా.కూటికుప్పల సూర్యారావు

కంచరపాలెం/మురళీనగర్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డా.కూటికుప్పల సూర్యరావు సోదరుడు అప్పారావు సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మురళీనగర్ అయ్యప్పనగర్‌లో ఆయన నివాసం ఉంటున్నారు. స్థానిక మాధవధార శ్మశానవాటిలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. సోదరుడి మరణంతో డా.కూటికుప్పల కన్నీటి పర్యతమయ్యారు. ఆయనను పలువురు పరామర్శించి ఓదార్చారు. అప్పారావు పోర్టు ఉద్యోగిగా రిటైర్డు అయ్యారు. అప్పారావు మృతదేహానికి స్థానికులు, రాజకీయ నాయకులు నివాళులు అర్పించారు.

లులూమాల్‌కు భూ కేటాయింపు రద్దుచేయాలి

- ఆ భూమిలో సైన్స్‌సిటీ లేదా సైన్స్ పార్కు నిర్మించాలి
- సామాజికవేత్త రాణిశర్మ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రాణిశర్మ

డాబాగార్డెన్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : లులూమాల్ సంస్థకు ఆర్కేబీచ్‌లో భూముల కేటాయింపు ప్రతిపాదనలు వెంటనే రద్దు రద్దు చేయాలని ప్రముఖ సామాజికవేత్త రాణిశర్మ డిమాండ్ చేశారు. ఆ సంస్థకు కేటాయించిన భూమిలో సైన్స్ సిటీ లేదా సైన్స్ పార్కుతో కూడిన మ్యూజియాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పౌర, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో లులూమాల్‌కు ఆర్కేబీచ్‌లో కేటాయింపుల అంశంపై పౌర వేదిక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్కేబీచ్‌లో ఉన్న 13.78 ఎకరాల భూమి మార్కెట్ విలువ రూ.3వేల కోట్లకు పైగా ఉందన్నారు. దీనిని ఉచితంగా 99 ఏళ్లకు లీజుకి ప్రభుత్వం ధారాదత్తం చేసిందని, ఏడాదికి లీజు కేవలం రిజిస్ట్రేషన్ విలువలో కేవలం 1 శాతం మాత్రమేనన్నారు. నిర్మాణాలు పూర్తయ్యే వరకు లీజు చెల్లించాల్సిన అవసరం లేదని జీవో ఇచ్చారని అన్నారు. దీని వల్ల ప్రభుత్వం ఏడాదికి కనీసం రూ.50 కోట్లు నష్టపోతుందన్నారు. టూరిజం పేరిట ఆర్కేబీచ్ నుంచి భోగాపురం వరకు సముద్రతీర ప్రాంత భూములను, కొండలను రిసార్ట్స్, స్టార్ హోటళ్లను ఇలా అనేక పేర్లతో సొంత ఆస్తులుగా మార్చుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈనెల 29న విశాఖలోని లులూమాల్ సంస్థకు ప్రభుత్వం భూకేటాయింపు ప్రతిపాదనలు రద్దు చేయాలని మేధావులు, పౌర, న్యాయ, అసోసియేషన్‌లతో కలిసి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రయోజనం కోసం భూములను వినియోగించడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆర్కేబీచ్ అద్భుతమైన ప్రకృతి సుందర సముద్రతీరమని ఈ ప్రాంతంలో సైన్స్ సిటీ నిర్మించాలని తీర్మానించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పౌరవేదిక ఏర్పాటు చేయగా దీనికి చైర్‌పర్సన్‌గా రాణిశర్మను ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గెడ్డల నిర్మాణ పనులు పూర్తిచేయాలి

- ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



గెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు

సీతంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట, మధురానగర్‌లో పద్మశాలి భవన్ వెనుక ఉన్న గెడ్డలను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ గెడ్డల పరిస్థితులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గెడ్డపై బ్లాక్స్ కల్వర్టులు నిర్మించాలని అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ విజయకుమార్, ఏఈ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



ఆర్పీపేటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంచరపాలెం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఒకటి నుంచి ఐదేళ్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆరు నెలలకు ఒకసారి నులి పురుగుల మాత్రలు వేసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్త పి.సుశీల అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్పీపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం డీవార్మింగ్ మాత్రలను పొడిచేసి పిల్లలకు తాగించారు.

మాధవధార: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త మౌలాబీబీ, ఏఎన్ఎం సిబ్బంది పిల్లలకు మాత్రలు వేశారు.

అక్కయ్యపాలెం: స్థానిక ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా హెచ్ఎం జయంతి రాధాకుమారి మాత్రలను వేయించారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, గోళ్లను కత్తిరించుకోవాలని, కాచి, చల్లాచర్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం



కార్యక్రమాన్ని తిలకిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా, తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేరు రైల్వే విస్తృతంగా 'హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం వద్ద వాల్తేరు డివిజన్ కల్చరల్ సంఘం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశభక్తి గీతాల కచేరీ, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్న స్వచ్ఛ భారత్ - స్వచ్ఛరైలు లక్ష్యాన్ని వివరిస్తూ స్కిట్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలను డీఆర్ఎం లలిత్ బొహ్రా, బ్రాంచి అధికారులు, ఉద్యోగులతో పాటు ప్రయాణికులు తిలకించి కళాకారులను అభినందించారు. ఎలక్ట్రికల్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ బీఎస్.రావు, డీఈఈ సాహు నేతృత్వంలో రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కార్పొరేటర్ పద్మారెడ్డి



జగన్‌తో సాడి పద్మారెడ్డి, కేకే రాజు

సీతమ్మధార, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీ నుంచి విజయం సాధించిన 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మారెడ్డికి జగన్ అభినందనలు తెలిపారు. అనంతరం కేకేరాజుతో పార్టీకి సంబంధించి చర్చించారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

విశాఖపట్నం/సీతమ్మధార, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత వృద్ధి కోసం సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యమై ముందుకు సాగాలని వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా అన్నారు. లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఆయన మట్లాడుతూ సాంకేతికను సృష్టించడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. కెరీర్ పురోగతికి కమ్యూనికేషన్ నైపుణ్యం కీలకమన్నారు. ఆర్థికాభివృద్ధి చెందుతున్న దేశంలో యువ తరానికి అపారమైన అవకాశాలు అందుబాటులోకి రానున్నాయాని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను తీర్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రియల్టర్ దామా సుబ్బారావు అరెస్టు

కూర్మన్నపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు తొలగించడంతో పాటు రహదారి నిర్మాణం చేపట్టారన్న అభియోగంపై రియల్టర్, రాజకీయ నాయకుడు దామా సుబ్బారావును మంగళవారం దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కూర్మన్నపాలెం సర్వే నంబరు 47లో గల 250 చదరపు గజాల ప్రభుత్వ భూమిని సుబ్బారావు ఆక్రమించి మెటల్ రోడ్డు వేస్తుండడంతో వీఆర్ఓ బీసీ శేషగిరిరావు రాతపూర్వకంగా మంగళవారం గాజువాక తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. తహశీల్దార్ బి.శ్రీనివాసరావు ఈ విషయమై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నించడంతో ఈ ఏడాది మార్చి 21న బోర్డు ఏర్పాటుచేశామని, దాని జోలికి వెళ్లొద్దని హెచ్చరించామని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదుచేసి దామా సుబ్బారావును అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి కోర్టులో హాజరుపరచగా, రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసిన సర్వే నంబర్లుపై హైకోర్టులో కేసులు ఉన్నాయని, ఆయన తరపు లాయర్లు న్యాయాధికారికి తెలియపరచారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ మంజూరైంది. కాగా, దామా సుబ్బారావు వైసీపీలో ఉండేవారు. గత ప్రభుత్వ హయాంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. గత ఏడాది కాలంగా వైసీపీకి దూరంగా ఉంటున్నారు. బీజేపీలో చేర తారని ప్రచారం ఉంది.

హమ్మయ్య.. బయటపడ్డారు

- సరియా జలపాతం అవతలి వైపు చిక్కుకున్న 31 మంది పర్యాటకులు
- తిరిగి వస్తుండగా ఉధృతంగా ప్రవహించిన గెడ్డ
- రోప్ సాయంతో రక్షించిన పోలీసులు, వలంటీర్లు



పర్యాటకులను సురక్షితంగా తీసుకువచ్చిన పోలీసులు, వలంటీర్లు

అనంతగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సరియా జలపాతం ఆవలి వైపు అందాలను తిలకించేందుకు వెళ్లిన 31 మంది పర్యాటకులు వరదల్లో చిక్కుకున్నారు. ఎగువ నుంచి వచ్చిన నీటితో జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో అక్కడే ఉండిపోయారు. విషయం తెలిసి పోలీసులు, వలంటీర్లు వారిని సురక్షితంగా చేర్చారు. వివరాలు ఇలా వున్నాయి. విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లికి చెందిన పర్యాటకులు మంగళవారం సరియా జలపాతాన్ని చూసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం అవతలి వైపు తిలకించేందుకు గెడ్డ దాటి వెళ్లారు. కొందరు వెంటనే వచ్చేశారు. మిగిలిన 31 మంది పర్యాటకులు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇటు వైపు వచ్చేందుకు బయలుదేరగా, ఎగువన భారీ వర్షం కురవడంతో గెడ్డ పొంగి ప్రవహించింది. దీంతో చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న దేవరాపల్లి, చీడికాడ, అనంతగిరి ఎస్ఐలు సత్యనారాయణ, సతీశ్, శ్రీనివాసరావు, వలంటీర్లు మహేశ్, రాజు, రాము, టీడీపీ నాయకుడు సురేశ్ అక్కడికి చేరుకుని, తాడు సహాయంతో పర్యాటకులను సురక్షితంగా తరలించారు.

ప్రజల మనిషి సీఎస్ రావు



సీఎస్ రావు చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న అతిథులు

సీతంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల మనిషి సీఎస్ రావ్ అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్ అన్నారు. పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి, సీఎస్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంఘ సేవకుడు, ప్రజా స్పందన అధ్యక్షుడు సీఎస్ రావు ఐఈఎస్ 95వ జయంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజా సమస్యలపై పోరాడి వాటి పరిష్కారానికి అవిశ్రాంత కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, చాగంటి జోగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సీనియారిటీ జాబితాను విడుదల చేయాలి'

మహారాణిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన సీనియారిటీ జాబితాల్లో హాల్‌టికెట్ నంబర్లు, ర్యాంకులు, మార్కుల్లో ఉన్న తప్పులను సరిచేసి, మెరిట్ కమ్ సీనియారిటి ఫైనల్ జాబితాలను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేశ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ డిప్యూటి కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వార్డు పరిపాలన కార్యదర్శుల సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు.

కనకమహాలక్ష్మి దేవస్థానంలో వెండిపై వివాదం

... 5వ పేజీ తరువాయి

ఈ తరహా బదలాయింపులు నిబంధనలకు విరుద్ధమని అధికారులే చెబుతున్నారు.

కమిషనర్ అనుమతి లేకుండా చేయలేరు

దేవస్థానాలకు వచ్చిన బంగారు, వెండి వస్తువులను ఏమైనా మార్పిడి చేయాలంటే...అందుకు ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి తీసుకోవాలి. ఆ వస్తువులను ప్రభుత్వానికి చెందిన మింట్‌కు పంపి, అక్కడే కరిగించాలి. ఇదంతా పెద్ద ప్రక్రియ. ఇలాంటివి ఎప్పుడో గానీ జరగవు. కనకమహాలక్ష్మి ఆలయంలో అంతా నోటిమాటలతో జరిగిపోయింది. కొత్తది 60 కిలోలు కావాలని, పాతది సుమారు 34 కిలోలు ఉంటుందని, మిగిలిన వెండి దాతల ద్వారా సమకూరుస్తామని హామీ ఇచ్చినట్టు చెబుతున్నారు. అవేవీ చేతికి రాక ముందే అమ్మవారికి ఆయన కొత్త తాపడం చేయించి ఇచ్చేశారు. దాంతో అధికారులకు పాత వెండి ఇవ్వాలనే ఆసక్తి పోయింది. ఆ తరువాత ఈఓలు ఒక్కొక్కరిగా మారిపోయారు. ఇటీవల ఆలయంలో ఒక వర్గం మరో వర్గానికి చెందిన వారిని ఇరికించాలనే ఉద్దేశంతో వెండి వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై జ్యూవెలరీ వెరిఫికేషన్ అధికారి (జేవీఓ) పల్లంరాజు ఇటీవల విచారణ చేశారు. ఈలోగా ఆయనకు సింహాచలం దేవస్థానం ఆభరణాలు లెక్క తేల్చే పని అప్పగించడంతో అటు వెళ్లారు. దాంతో ఇక్కడ లెక్కలు మధ్యలో ఆగిపోయాయి.

డీసీ విచారణ చేస్తున్నారు

కె.శోభారాణి, ఈఓ, కనకమహాలక్ష్మి దేవస్థానం

అమ్మవారి వెండి తాపడంపై ప్రముఖ దాత ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. దానిపై డిప్యూటీ కమిషనర్ విచారిస్తున్నారు. అయితే ఆలయంలో పాత తాపడం, కొత్త తాపడం రెండూ ఉన్నాయి, నష్టం ఏమీ జరగలేదు. కాకపోతే రశీదులు లేవు.

ఉక్కు విద్యాలయాలకు చిక్కులు

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యం యత్నించింది. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కల్పించుకొని ఆ ఏడాదికి సాయం ఇప్పించారు. ఈ ఏడాది కూడా విద్యా శాఖ నుంచి అనుమతి కావాలంటే...యాజమాన్యం భవనం లీజు అగ్రిమెంట్‌ను డయసిస్‌కు ఇవ్వాలి. దానిని జిల్లా విద్యా శాఖాధికారికి సమర్పిస్తే అనుమతి లభిస్తుంది. అయితే స్టీల్ యాజమాన్యం విద్యా సంస్థను మూసేయాలనే ఉద్దేశంతో ఒప్పందం చేయలేదు. దాంతో అనుమతి రాలేదు. ఈ నేపథ్యంలో నిర్వహణ సంస్థ కోర్టును ఆశ్రయించినట్టు తెలిసింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావడం, పాఠశాలలు తెరవకపోవడం, గొడవలు జరగడంతో విద్యార్థులను తల్లిదండ్రులు వేరే పాఠశాలల్లో చేర్పించేశారు. మరికొంతమంది మాత్రం పాఠశాల తెరిస్తే చేరుదామని వేచి ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయం పరిస్థితీ అంతే

స్టీల్ ప్లాంటు, సీఐఎస్ఎఫ్, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లల కోసం 70 ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు క్లాసులు ఉన్నాయి. వేయి మంది వరకు విద్యార్థుల ఉన్నారు. బోధన సిబ్బంది మాత్రం అందుకు తగినట్టుగా లేరు. సగం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని నిర్వహణను కూడా స్టీల్ ప్లాంటు యాజమాన్యం భారంగా భావిస్తోంది. గత ఏడాదే ఒకటో తరగతి, 11వ తరగతి (ప్లస్ వన్) అడ్మిషన్లు ఆపేసింది. ఈ ఏడాది కూడా అదేవిధంగా చేసింది. దాంతో తరగతులు తగ్గిపోయాయి. ఈ ఏడాది ప్లస్ టు చదువుతున్న విద్యార్థులు వెళ్లిపోతే ఇకపై పదో తరగతి వరకే ఉంటుంది. గత ఏడాది ఒకటో తరగతి అడ్మిషన్లు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది రెండో తరగతికి వచ్చేవారు ఎవరూ లేరు. ఈ ఏడాది కూడా ఒకటో తరగతికి ఎవరినీ తీసుకోలేదు. అంటే రెండు తరగతులు తగ్గిపోయాయి. క్రమంగా దీనిని కూడా మూసేయాలనేది యాజమాన్యం వ్యూహంగా చెబుతున్నారు.

మారని ఏయూ తీరు!

... 5వ పేజీ తరువాయి

ప్రాక్టికల్స్ నిర్వహించే బాధ్యతను ప్రభుత్వ కాలేజీలకు మాత్రమే అప్పగించాలని నిర్ణయించారు. ఆ దిశగా ఇప్పటివరకూ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో మరోసారి ప్రైవేటు కాలేజీలకే ప్రాక్టికల్స్ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఈ విధంగా కాలేజీలు భారీగా దండుకునే అవకాశాన్ని వర్సిటీ అధికారులు కల్పిస్తున్నారు.

వసూళ్లే లక్ష్యం..

ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి భారీగా వసూలు చేసేందుకు ఎగ్జామ్ సెంటర్ల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి మూడు వేల నుంచి ఐదు వేల రూపాయల వరకూ వసూలు చేయనున్నట్టు చెబుతున్నారు. విద్యార్థులు చెల్లించే మొత్తాన్ని బట్టి తరగతులకు, ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సిన అవసరం లేకుండానే సదరు కాలేజీ యాజమాన్యాలు తతంగం నడిపిస్తాయి. గతంలో దూర విద్య పరీక్షలకు సంబంధించిన ప్రాక్టికల్స్‌ను ప్రభుత్వ కాలేజీల్లోనే నిర్వహించేవారు. ఆ తరువాత ప్రైవేటు కాలేజీలకు అప్పగించారు. ప్రైవేటుకు మార్చిన తరువాత ప్రాక్టికల్స్ ప్రక్రియ తూతూమంత్రంగా సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో వర్సిటీ ఆదాయానికి గండి పడుతోంది. ప్రాక్టికల్స్ నిర్వహణకు వర్సిటీ నుంచి ఆయా కాలేజీలకు కొంత మొత్తాన్ని చెల్లిస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.50 వేలు నుంచి రూ.3 లక్షల వరకూ యూనివర్సిటీ చెల్లిస్తుంది. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు, సక్రమంగా ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ప్రభుత్వ కాలేజీలకు ఈ బాధ్యతలను అప్పగించడం ముఖ్యమని పలువురు సూచిస్తున్నారు. మరోవైపు దూరవిద్య కేంద్రంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులను మార్చాలని వైస్ చాన్సలర్ భావించారు. ముఖ్యంగా కోర్సులు నిర్వహించని విభాగాలకు చెందిన వారిని వెనక్కి పంపించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఫైల్ కూడా రెడీ చేశారు. కొందరు అధికారులు సంతకాలు కూడా పూర్తయ్యాయి. మళ్లీ ఏమైందో తెలియదు గానీ సదరు సిబ్బందిని అక్కడే కొనసాగిస్తున్నారు. దీనివెనుక మర్మమేమిటో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఏళ్ల నుంచి పాతుకుపోయిన ఉద్యోగులను మారిస్తే దూర విద్య ప్రక్షాళన సాధ్యమవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

ట్యాంకర్ల టెండర్లలో కాంట్రాక్టర్లు రింగ్

... 5వ పేజీ తరువాయి

మొత్తం పది ట్యాంకర్ల ఏర్పాటుకు సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో ఐదు వర్కులుగా విభజించి ఇటీవల టెండర్లు పిలిచారు. బిడ్ దాఖలుకు ఈనెల 11 తుది గడువుగా పేర్కొన్నారు. ఇప్పటికే వాటర్ ట్యాంకర్లను తిప్పుతున్న వారితోపాటు కొత్తగా ఆ వ్యాపారంలోకి రావాలనుకుంటున్నవారు కూడా టెండరులో పాల్గొనాలని భావించారు. అయితే జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలో కీలకంగా వ్యవహరిస్తున్న నేత ఒకరు రంగంలోకి దిగారు. తనకు అత్యంత ఆప్తులైన కాంట్రాక్టర్లకు ఆయా వర్కులను కట్టబెట్టేందుకు వ్యూహం అమలు చేశారు. టెండరులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేయాలని ఆదేశించారు. ఆసక్తి ఉన్న వారందరికీ ఒక్కో వర్కు చొప్పున లాటరీ ద్వారా కేటాయిస్తానని, దీనివల్ల లెస్‌లు తగ్గి కాంట్రాక్టర్లకు మేలు జరుగుతుందని వివరించారు. దీంతో ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు గ్రూపులో మెసేజ్ చేయగా వారందరితో ఈనెల పదిన యూనియన్ కార్యాలయంలో సమావేశం పెట్టారు. ఆ సమయంలో ఎవరికి ఏ వర్కు కేటాయిస్తున్నామనేది చెప్పి, మిగిలిన వారికి తర్వాత ఏదో ఒక వర్కు ఇస్తామన్నారు. వర్కును ఎవరికి కేటాయిస్తున్నామో వారు మాత్రమే రెండు, మూడు శాతం లెస్‌కు బిడ్ వేయాలని, మరో ఇద్దరు కాస్త ఎక్కువకు డమ్మీ బిడ్లు వేస్తారని స్పష్టంచేశారు. దీనివల్ల సింగిల్ బిడ్ అనే కారణంతో టెండరుని రద్దు చేయడానికి వీలుండదనేది యూనియన్ నేత ఉద్దేశం. కొంతమంది కాంట్రాక్టర్లు యూనియన్ నేత ప్రతిపాదనకు నిరాకరించి, తాము బిడ్ వేస్తామని స్పష్టం చేయగా, వారి ఎదురుగానే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడతానని చెప్పి కాల్ చేశారు. తాను చెప్పినవారు కాకుండా ఇంకెవరైనా బిడ్ వేస్తే వారిని అనర్హులుగా పక్కనపెట్టేయాలని చెప్పగా, అటు వైపు నుంచి అధికారులమని చెప్పినవారు కూడా అలాగే చేస్తామని చెప్పడంతో చాలామంది కాంట్రాక్టర్లు ఎందుకొచ్చిన గొడవని వెనకడుగు వేశారు. ఒకరిద్దరు మాత్రం ఏదైతే అదే జరుగుతుందని చెప్పి సొంతంగా బిడ్ వేశారు. సోమవారం బిడ్ దాఖలకు ఆఖరుతేదీ కాగా, అదేరోజు టెక్నికల్ బిడ్‌ను అధికారులు తెరిచినట్టు తెలిసింది. కాంట్రాక్టర్ల సంఘం నేత బెదిరింపులకు కాంట్రాక్టర్లు భయపడిపోవడంతో నీటిసరఫరా ట్యాంకర్ల టెండర్లు అన్నీ పది శాతంలోపే లెస్‌లకు వెళతాయని కాంట్రాక్టర్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల కాంట్రాక్టర్ల మధ్య పోటీ తగ్గిపోయి జీవీఎంసీ ఖజానాకు నష్టం వాటిల్లనున్నది.

అబద్ధాల సృష్టి!

... 5వ పేజీ తరువాయి

గుర్తించలేకపోయినట్టు చెబుతున్నారు. ఇకపోతే, ఇప్పటి వరకు విశాఖ కేంద్రంలో పనిచేసిన ముగ్గురు వైద్యులు, నలుగురు దళారులను అరెస్టు చేశారు. మరికొందరిని అరెస్టు చేసే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో అరెస్టు అయిన డాక్టర్ విద్యుల్లత పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేవారు. డాక్టర్ ఉషాదేవి ప్రసవాలకు సంబంధించి విషయాలను చూసేవారు. వీరికి డాక్టర్ నమ్రతతో సన్నిహిత సంబంధాలున్నట్టు చెబుతున్నారు. డాక్టర్ వాసుపల్లి రవి అనస్థీషియాకు సంబంధించిన సేవలను అందించారు.

సెయింట్ జోసెఫ్‌లో అంతర్జాతీయ యువజన దినోత్సవం

జ్ఞానాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, పొలిటికల్ సైన్స్ మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. 'ప్రపంచ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం యువత సాధికారత' అంశంపై ప్రోగ్రాం అధికారి కె.మాణిక్యకుమారి ప్రసంగించారు.


గాజువాక హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు

గాజువాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం గాజువాకలో నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గాజువాకలోని పలు పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. చిన్నారుల కడుపులో నులిపురుగులు ఉన్నట్టయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని వైద్య బృందం సభ్యులు తెలిపారు. గాజువాక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు కె.సింహాచలం, నెట్టి వాసు, వైద్యులు హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో ఇటీవల ప్రారంభమైన పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ గుడివాడ అనూష మంగళవారం పరిశీలించారు. కాలనీలో నిర్మిస్తున్న రోడ్లు, కాలువలతోపాటు బోరింగ్ పనులను తిలకించారు. ఆమె వెంట స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, రమణ, తదితరులు ఉన్నారు.

సీఐటీయూ ఆందోళన

మల్కాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని, పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని హిందుస్థాన్ షిప్‌యార్డు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామన్నప్పుడు వ్యతిరేకించి టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చాక వాటి ఏర్పాటుకు ముందుకు రావడం దారుణమన్నారు. జోన్ నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను మన ఇళ్లకు బిగిస్తే మన తల పులి బోనులో పెట్టినట్టే అవుతుందని, విద్యుత్ బిల్లులు బాగా పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.పెంటారావు, సత్యారావు, జి.నరేశ్, బి.శ్రీను, ఎన్.శ్రీను, ఎస్.వాసు, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'

అగనంపూడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శివాజీనగర్ బూత్ నంబర్-5లో గల పలు ప్రాంతాల్లో మంగళవారం టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు మహిళ వార్డు అధ్యక్షురాలు గల్లా హనిత పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గల్లా రుద్రకుమార్, ఎస్.సింహాచలం, జి.సూర్యనారాయణ, జి.నరసింగరావు, జె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 26, పచ్చిమిర్చి 66, కాకరకాయలు 24, బీరకాయలు 24, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 26, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 36, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, క్రరపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	93
లైవ్ ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

'400 ఆర్/టీ' బస్సుకు భలే ఆదరణ

- అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకుంటున్నారన్న ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, ఏఎంటీ శ్రీనివాస్
- 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు


400 ఆర్/టీ బస్సు

కూర్మన్నపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఈ ఏడాది జూన్ 2న ప్రారంభించిన 400 ఆర్/టీ బస్సుకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, ఏఎంటీ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. ఈ బస్సు ఆవశ్యకత గురించి తిరుమల నగర్ కాలనీవాసులు 'ఆంధ్రజ్యోతి'కి, ప్రజాప్రతినిధులకు, ఆర్టీసీ ఉన్నతాధికారులకు పలుమార్లు వినతులు సమర్పించారన్నారు. అంతేకాకుండా 'అక్షరం అండగా-పరిష్కారం అజెండాగా' పేరిట ఈ ఏడాది జనవరి 28న 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో కూడా ఈ బస్సు అవసరాన్ని ఆర్టీసీ అధికారులకు తిరుమల నగర్ కాలనీవాసులు వివరించారు. దీంతో జూన్ 2న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్, సిటీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, ఏఎంటీ శ్రీనివాస్‌ల చేతుల మీదుగా నంబర్ '400 ఆర్/టీ' బస్సును ప్రారంభించారు. ప్రతి రోజూ ఈ బస్సు 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో ఉదయం 7.35 గంటలకు బయలుదేరి వుడా నగర్, పకీరుతఖ్యా, ఎంవీవీ అపార్టు మెంట్ మీదుగా 87వ వార్డు సిద్ధార్థనగర్, తిరుమల నగర్, కణితి, వడ్లపూడికి 7.45 గంటలకు చేరుతోంది. అలాగే విశ్వేశ్వరాయ నగర్, శ్రీనగర్, చిగంట్యాడ, గాజువాక, శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా, రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుతోంది.

మళ్లీ సాయంత్రం 5.45 గంటలకు వడ్లపూడి, తిరుమల నగర్ మీదుగా రాజీవ్‌నగర్ చేరుకుంటుందని డీఎం తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగులు, విద్యార్థులు, పలు కర్మాగారాల కార్మికులు, ఆస్పత్రికి రాకపోకలు సాగించే రోగులు, తదితరులు ఈ బస్సులు ఎక్కువగా వినియోగించుకుంటున్నారన్నారు. రోజుకు రెండు పూటల తిరిగే ఈ బస్సును ఆయా ప్రాంతాల ప్రజలు కూడా వినియోగించుకోవాలని తిరుమల నగర్ అసోసియేషన్ సభ్యులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందంలు కోరారు. ఈ రూట్‌లో బస్సు ఏర్పాటుకు కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి, ఆర్టీసీ అధికారులకు, కార్పొరేటర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయాలకు ఆధునిక సాంకేతికత అవసరం

- కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి
- పలుచోట్ల గ్రంథాలయ పాలక పితామహుడు పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి


పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో పూర్వపు గ్రంథాలయాధికారిణి అమ్మాజీని సత్కరించిన పులి లక్ష్మీబాయి, తదితరులు

పెదగంట్యాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సమాజానికి అనుగుణంగా గ్రంథాలయాలకు ఆధునిక సాంకేతికత అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. గ్రంథాలయ పాలక పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పూర్వపు గ్రంథాలయాధికారిణి బి.అమ్మాజీ మాట్లాడుతూ గతంలో పుస్తకాలు, పలు పత్రికలు చదవడం వల్ల విద్యార్థులు, పాఠకులు విజ్ఞానం పొందేవారని, ఇప్పుడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, ఇంటర్నెట్ ద్వారా ఎప్పటి సమాచారం అప్పుడే తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. అందువల్ల గ్రంథాలయాల్లో ఇంటర్నెట్, కంప్యూటర్లు వంటి వాటిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సాహిత్యసుధ వ్యవస్థాపకుడు అద్దంకి రాఘవాచార్యులు మాట్లాడుతూ గ్రంథాలయాల్లోని పుస్తకాల్లో ఉన్న సమాచారమంతా ఇప్పుడు ఇంటర్నెట్‌లో ఉంటుందన్నారు. అందువల్ల టెక్నాలజీని అన్ని గ్రంథాలయాలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా సుమారు పాతికేళ్ల పాటు స్థానిక శాఖా గ్రంథాలయాధికారిణిగా పనిచేసిన అమ్మాజీని పులి లక్ష్మీబాయి, పలువురు గ్రంథాలయాల పాలకులు ఘనంగా సత్కరించారు.

అనంతరం గ్రంథాలయాల పాలకులు ఎన్‌వీ నరసింహం (గోపాలపట్నం), బి.చంద్రకళ (పెందుర్తి), వి.శిరీష (సబ్బవరం), బీవీఎస్ అప్పారావు (అడవి వరం), నూకరాజు (ఆనందపురం), డీసీఎల్ఎల్ వర్మ (అల్లిపురం), పారిశ్రామిక ప్రాంత గ్రంథాలయాల అధికారులు బి.పద్మావతి, వి.అజయ్‌కుమార్, బి.సూర్యకళలను సత్కరించారు. స్థానిక శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ వందన సమర్పణ చేయగా, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ప్రముఖ గ్రంథాలయాధికారి, సార్వత్రిక విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు డి.మురళీధర్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరుకునేందుకు యువత గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈవీఎస్ భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత తహశీల్దార్ ఆర్.రఘురామ్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో రంగనాథన్ చేసిన సేవలు అనిర్వచనీయమైనవని కొనియాడారు. గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం మాట్లాడుతూ గ్రంథాలయ పరిపాలన, గ్రంథాలయంలో పుస్తకాల వర్గీకరణ సిద్ధాంత ద్వారా గ్రంథాలయాలకు అశేష సేవలందించిన ఘనత రంగనాథన్‌కే దక్కుతుందన్నారు. తొలుత ముఖ్యఅతిథులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెందుర్తి: గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి చంద్రకళ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. రంగనాథన్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

వేపగుంట: గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపంలో గల ఆర్ఆర్‌వీ పురం ఆళ్వార్స్ కళాశాలలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి గ్రంథాలయ గొప్పతనం, ప్రాముఖ్యం, విలువను తెలియజేయాల్సిన అవశ్యకత ఉపాధ్యాయులపై ఉందన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యం, విశ్లేషణ, తదితర అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, తదితర తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేయడంతో పాటు కళాశాల ఈడీ సుంకరి ఆళ్వార్‌దాస్ ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజు, పి.సత్య, గోపి, హేమచంద్రరావు, విజయకుమార్, రమణి, తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ మ్యాన్‌హోల్‌తో పొంచివున్న ప్రమాదం


ప్రమాదాలు జరగకుండా మ్యాన్‌హోల్‌పై టైర్లు పెట్టిన యువకులు

గోపాలపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డులో ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్ ప్రమాదాలకు నిలయంగా మారింది. స్థానిక ఎల్బీ పాలిమర్స్ కూడలికి సమీపంలో బెహరా ఆస్పత్రికి ఎదురుగా ఉన్న సర్వీసు రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో పలువురు వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో వాహనచోదకులు ప్రమాదాల బారినపడకుండా ఉండేందుకు గాను పలువురు స్థానికులు ఈ మ్యాన్‌హోల్‌పై టైర్లను పెట్టారు. అందువల్ల సంబంధిత అధికారులు దీనిపై దృష్టిసారించి యూజీడీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, టీడీపీ ఎంపీలు మిట్టల్ ఊడిగం చేయడం ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌లకు కేంద్రం సొంత గనులు కేటాయించిందని, విశాఖ ప్లాంట్‌పై వివక్ష చూపిస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు కాబోయే అర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ఎండీసీ నుంచి గనుల కేటాయింపు, పైపులైన్ల ద్వారా సరఫరాకు అనుమతులు వేగవంతం చేయాలని ఎంపీ శ్రీభరత్, తెలుగుదేశం ఎంపీల బృందం ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. అధికారమిస్తే విశాఖ ఉక్కుకు సొంతగనులు సాధించి, ప్లాంటును లాభాలబాట పట్టిస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చి, ఇప్పుడు మాటతప్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, కృష్ణారావు, కుమార్, మణి, రాజు, చలపతి, తదతరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతాలు


మంగళగౌరీ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెంలో గల శ్రీదుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని మంగళగౌరీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వందల మంది మహిళలు అమ్మవారి కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్న సమారాధన చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రివేణి గ్రామాభ్యుదయ ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి

అగనంపూడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులందరూ ర్యాగింగ్ జోలికి పోవద్దని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి సూచించారు. ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల జరిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిపుచ్చుకోవాలని, అందరూ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కన్వీనర్ సూర్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలమాంబకు ప్రత్యేక పూజలు

మల్కాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఎస్సీ కాలనీలో గల పోలమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 32 ఏళ్లవుతున్న సందర్భంగా భక్తులు పూజలు ఆలయానికి వేపకొమ్మలు కట్టి, రంగుముగ్గులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

'కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదు'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఏ ఒక్కరినీ విధుల నుంచి తొలగించరాదని అధికారులను ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరారు. ప్లాంటులో బుధవారం ఉక్కు అధికారులతో కార్మిక సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఇటీవల కాలంలో కాంట్రాక్టు కార్మికులను తొలగించడం వల్ల అనేక మంది కుటుంబాలతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల భవిష్యత్తులో ఎవరినీ తొలగించరాదని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వేడుకున్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి రూ.రెండు లక్షల నష్ట పరిహారం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో సోమవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సురేశ్‌సింగ్ కుటుంబానికి రూ.రెండు లక్షల నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. మృతుడు పనిచేస్తున్న కాంట్రాక్టు సంస్థ కేఆర్ఎల్ ప్రతినిధులు, ఉక్కు కార్మిక నాయకుల మధ్య మంగళవారం జరిగిన చర్చల్లో రూ.రెండు లక్షల నష్ట పరిహారం ఇచ్చేందుకు, ఇందులో తక్షణమే రూ.50 వేలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. అలాగే సురేశ్‌సింగ్ మృతదేహాన్ని బిహార్ తరలించేందుకు రవాణా ఖర్చులు చెల్లించేందుకు కాంట్రాక్టు సంస్థ అంగీకారం తెలిపింది. చర్చల్లో కార్మిక నాయకులు మంత్రి రవి, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొళాయిలు ప్రారంభం

పెందుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 97వ వార్డు చినముషిడివాడ పరిధిలో గల వీరానగర్‌లో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలను కార్పొరేటర్ సేనాపతి వసంత ప్రారంభించారు. ఇంటింటికీ కొళాయిల ద్వారా సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సేనాపతి శంకరరావు, ఏతః రాజశేఖర్, కాలనీవాసులు అప్పారావు, ఆనంద్, శ్రీను, గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ముఖ్వన్నెల పతాకాలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

గంగవరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

గాజువాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గంగవరం గ్రామంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరసపల్లి నూకరాజులు ఈ యాత్రను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. నాయకులు పేర్ల అప్పారావు, మాధవి, సురేశ్‌రెడ్డి, నాయుడు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వందడుగుల జాతీయ జెండాతో..

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడి ఓక్‌వ్యాలీ స్కూల్ ఆధ్వర్యంలో వందడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, జాతీయ జెండా ఎగరవేసేందుకు గల కారణాలను స్కూల్ అధినేత ఎ.బాలరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రణయ్‌దీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉక్కు నిర్వాసితుల సమస్య

పెదగంట్యాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు నిర్వాసిత నిరుద్యోగుల ఉపాధి సమస్యను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్వాసిత నిరుద్యోగ ప్రతినిధుల సమావేశం నిర్ణయించింది. ఇక్కడి సీతానగరం కమ్యూనిటీ హాల్ ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో స్టీల్ ప్లాంట్ ఇంటక్ కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.వంశీకృష్ణ మాట్లాడుతూ కర్మాగారంలో శాశ్వత ఉపాధి దొరక్క నిర్వాసిత నిరుద్యోగులు కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. ఇప్పుడు వారిని కూడా యాజమాన్యం తొలగించి ఉపాధి లేకుండా చేసిందని పేర్కొన్నారు. ప్లాంట్‌లోని కాంట్రాక్టర్లు ఇప్పుడు వేరే ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులను పనుల్లోకి తీసుకుంటుండడం సమంజసం కాదన్నారు. ఈ అంశాలన్నింటినీ ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. నిర్వాసిత నిరుద్యోగ సంఘ ప్రతినిధులు నమ్మి అప్పలనాయుడు, పి.చంద్రరావు, ఎన్.నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమగ్ర అభివృద్ధికి ఉధృత పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ సమగ్ర అభివృద్ధికి ఉధృత పోరాటం చేస్తామని, పార్టీ 28వ రాష్ట్ర మహాసభలు ఈనెల 23 నుంచి ఒంగోలులో జరగనున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ తెలిపారు. అల్లిపురంలోని పార్టీకార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చేయాల్సిన పోరాటాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బీచ్‌రోడ్డులో రూ.వందల కోట్లు విలువైన 13.74 ఎకరాల ప్రభుత్వభూమిని లూలుకు కేటాయించడం సరికాదని, తక్షణం ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయింపుపై ఎంపీలు పట్టించుకోవడంలేదని, నక్కపల్లిలో నిర్మిస్తున్న మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని ఏడుగురు ఎంపీలు ఉక్కు మంత్రికి విజ్ఞప్తి చేయడం దారుణమన్నారు. విశాఖ రైల్వేజోన్‌కు భూమిపూజతోనే సరిపెట్టేశారని, తక్షణం రూ.9,138 కోట్లతో నిర్మాణపనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విశాఖ మెట్రోకి 34 కిలోమీటర్లు కారిడార్ నిర్మిస్తామని చెబుతున్నారని, హైదరాబాద్, చెన్నై అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని వరదలను తట్టుకునేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, చంద్రశేఖర్, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళవారం సందర్భంగా ముగ్గురు అమ్మవార్లకు సారె సమర్పించారు. అమ్మవార్ల పుట్టబంగారం ప్రదేశం నుంచి భక్తులు వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పిండివంటలతో హైస్కూల్ మైదానంలో నూతనంగా నిర్మించిన కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయానికి ఊరేగింపుగా సారె తెచ్చి నైవేద్యంగా సమర్పించారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, ఆలయ కమిటీ నాయకులు సంగ్రాన నూకరాజు, సత్యారావు, రమణ, సత్యవతి, శాంతి, గంగాభవాని, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోసే అవయవ దానం





ఒక వ్యక్తి అవయవాలతో 18 మందికి పునర్జన్మ

- అపోహలు, అనుమానాలతోనే చాలామంది దూరం
- అవగాహన కార్యక్రమాలతో ముందుకొస్తున్న దాతలు
- వ్యాపారాత్మక ధోరణికి అడ్డుకట్ట పడాలంటున్న నిపుణులు
- అవయవదాతకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ప్రభుత్వం
- నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): **దేశంలో కిడ్నీ, లివర్, హార్ట్ వంటి శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాలు పాడై దాతల కోసం ఎదురు చూస్తున్న లక్షలాది మంది బాధితులున్నారు. వారి ప్రాణాలను కాపాడేందుకు ఉన్న ఏకైక అవకాశం అవయవదానం. ఈ కార్యక్రమంపై అవగాహన లేకపోవడంతో ఎంతోమంది దాతల కోసం ఎదురు చూస్తూనే ప్రాణాలు విడుస్తున్నారు. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చే వారిని ప్రభుత్వం కూడా ప్రోత్సహి స్తోంది. ప్రజల్లో అవయవదానం పట్ల అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 13న జాతీయ అవయవదాన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.**

అవయవదానం అంటే ఒక వ్యక్తి మరణానంతరం తన అవయవాలను మరో వ్యక్తి ద్వారా దానం చేయడం. ఇది ప్రాణదానంతో సమానం. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను, అవయవాలు పాడై చికిత్స పొందుతూ ఉన్న వ్యక్తికి అమర్చడాన్ని అవయవదాన మార్పిడి అంటారు. అవయవదానం చేసే వ్యక్తిని బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన తరువాత మాత్రమే దానం చేసేందుకు అవకాశం ఉంది. కిడ్నీలు, లివర్ బతికుండగానే దానం చేయవచ్చు. ప్రమాదం వల్ల గానీ, మరో కారణం వల్ల గానీ బ్రెయిన్‌డెడ్ అయిన తరువాత అవయవదానం చేస్తుంటారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జీవన్‌దాన్ వెబ్‌సైట్ ద్వారా గానీ, స్వచ్ఛంద సంస్థలో గానీ పేరు నమోదు చేసుకుని అవయవదానం చేయడానికి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవచ్చు. జీవన్‌దాన్ కార్యక్రమాన్ని 2015 నుంచి రాష్ట్రంలో అమలుచేస్తున్నారు.

దాతల కోసం నిరీక్షణ..

ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి మంది బాధితులు అవయవదాతల కోసం ఎదురు చూస్తున్నట్టు అంచనా. ఇలాంటి వారు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఐదు వేల మంది ఉన్నారు. ఇందులో 1,491 మందికి లివర్, 3,062 మంది కిడ్నీ, 81 మంది గుండె, 15 మంది లంగ్స్, నలుగురికి ప్రాంక్రియాస్ అవసరం. ఇప్పటివరకు జీవన్‌దాన్ ద్వారా 1,148 మందికి వివిధ రకాల అవయవాలను సమకూర్చారు. ఇందులో 638 మందికి కిడ్నీ, 279 మందికి లివర్, 88 మందికి గుండె, 151 మందికి ఊపిరితిత్తులు, ముగ్గురికి పాంక్రియాస్, స్మాల్‌బౌల్‌ను ఒకరికి అందించారు.

విమ్స్‌లో నిర్వహణ..

విమ్స్‌లో అవయవాలను సేకరించే శస్త్రచికిత్సల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కొద్దినెలల కిందట తొలిసారిగా లివర్ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. ఇప్పటివరకు విమ్స్‌లో నాలుగు బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాలను సేకరించారు. విమ్స్ తరహాలోనే కేజీహెచ్‌లోనూ అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహిస్తే నిరుపేద రోగులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

అవగాహన అవసరం..

దేశంలో సుమారు మూడు లక్షల మంది, రాష్ట్రంలో ఐదు వేల మంది, ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది అవయవదాతల కోసం ఎదురుచూస్తూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అవయవదానం పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడంతో చాలా మంది ముందుకు రావడం లేదు. స్పెయిన్‌లో 46.9 శాతం, అమెరికాలో 31.96 శాతం మంది అవయవదానం చేసేందుకు ముందుకు వస్తుండగా భారత్‌లో ఒకశాతం మంది కూడా ఆసక్తి చూపడం లేదు. అయితే రాష్ట్రంలో ఈ పరిస్థితి కొంతమెరుగ్గా ఉంది. సుమారు 3.5 శాతం మంది అవయవదానానికి ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే గతంలో ఏపీ కేంద్రం నుంచి బెస్ట్ ఎమర్జింగ్ స్టేట్ ఇన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవార్డును అందుకుంది.

ఇవి దానం చేయొచ్చు..

ప్రతి వ్యక్తి శరీరం నుంచి 11 రకాల అవయవాలను దానం చేయవచ్చు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి శరీరం నుంచి గుండె, రెండు జతల కవాటాలు, కిడ్నీలు, నేత్రాలు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమం, ప్రాంక్రియాస్, కర్ణభేరి, గాల్‌బ్లేడర్, యూరినరీ బ్లేడర్, చర్మం, ఎముకలు, కండరాలు, ఎముకల్లోని మజ్జ వంటివి సేకరించవచ్చు. ఈ అవయవాలతో 18 మంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంది.

ప్రజలను జాగృతం చేస్తున్నాం



ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో జీవన్‌దాన్ ద్వారా అవయవదానం పట్ల పెద్దఎత్తున అవగాహన కలిగిస్తున్నాం. ఇప్పటివరకు ఎంతోమందికి అవయవాలను సమకూర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాం. ఇంకా చాలామంది బాధితులున్నారు. వారికి అవయవాలను అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. బ్రెయిన్‌డెడ్ బాధిత కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఒప్పిస్తున్నా... చివరి నిమిషంలో తప్పుకుంటున్నారు. దీనివల్ల కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇష్టం లేకుండా ఈ ప్రక్రియను చేపట్టడంలేదు. ప్రభుత్వం అవయవదానం చేసిన వ్యక్తికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విమ్స్‌లో అవయవదాన శస్త్రచికిత్సలు చేస్తున్నాం. భవిష్యత్తులో మరింత మంది జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం.

- డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్

దేశాభివృద్ధికి భారత్ పోర్టు బిల్లు కీలకం

ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో సముద్ర వాణిజ్యం పెరగడానికి, పోర్టు ఆధారిత కార్యకలాపాల విస్తృతికి భారత పోర్టు బిల్లు -2025 అవశ్యమని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ అన్నారు. పార్లమెంటులో ఈ బిల్లుపై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సముద్రతీరం ఉందని, దశాబ్ద కాలంలో పోర్టులు ప్రగతిని సాధించాయన్నారు. నౌకల టర్న్ అరౌండ్ సమయం 93 గంటల నుంచి 48 గంటలకు తగ్గిందన్నారు. సీఎం చంద్రబాబు ప్రతి 50 కి.మీ.కు ఒక ఫిష్ పోర్టును అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ బిల్లు తీర ప్రాంతాలకు దీర్ఘకాలిక లాభాలు అందిస్తుందన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బెటాలియన్ సిబ్బంది

మాతృభూమి రుణం తీర్చుకుందాం

- హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

డాబాగార్డెన్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భావితరాల్లో భారత స్వాతంత్య్ర స్ఫూర్తిని పెంపొదిద్దామని, భరతమాత ముద్దుబిడ్డలుగా మాతృభూమి రుణం తీర్చుకుందామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకోవాలన్నారు. బీచ్ రోడ్డులో మంగళవారం హర్‌ఘర్ తిరంగా యాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, క్రీడాకారాలు, విద్యార్థులుపాల్గొన్నారు. యూసీడీ, ఐసీడీఎస్, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హర్ ఘర్ వస్తు ప్రదర్శన మేళాను కలెక్టర్ తిలకించారు. జాతీయ జెండాను తెలుగు వ్యక్తి రూపొందించడం గర్వకారమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు, బెటాలియన్ కమాండెంట్ భగత్ సింగ్, 198, 234 బెటాలియన్ల అధికారులు, సిబ్బంది, డివిజనల్ పీర్వో డి.నారాయణరావు, ఏపీ సూపర్‌వైజర్ వెంకటరావు, ఏఈ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను వినియోగించేలా భక్తులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేశారు. విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సవరించిన మార్గదర్శకాలపై చర్చించారు. పర్యావరణానికి హానిచేయని విగ్రహాలను వినియోగించాలన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించేలా చూస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


15 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

రామ్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నామని సాగర్ నగర్ ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభు తెలిపారు. దసపల్లా హోటల్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 15న సాంస్కృతిక కార్యక్రమాలు, 16న ఉదయం 4.30 మంగళ హారతి, అఖండ హరినామ సంకీర్తనలు, ఉట్టి సంబరం, మహాపుష్పాభిషేకం, దీపహారతి, భక్తులకు ప్రసాద వితరణ చేస్తామన్నారు. సమావేశంలో మాతాజీ నితాయిసేవినీ, కోఆర్డినేటర్ ఎంవీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగుతున్న సముద్రం



సాగర్‌నగర్‌కు కొట్టుకువచ్చిన సిమెంటు గొట్టం

సాగర్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా సముద్రం ఉప్పొంగుతూ ఆందోళనకర రీతిలో కెరటాలు తీరాన్ని తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో సాగర్‌నగర్ బీచ్‌కు కల్వర్టుల కింద వినియోగించే సిమెంటు గొట్టం కొట్టుకు వచ్చింది. నదీ పరీవాహక ప్రాంతాలు, సముద్రం కలిసే చోట ఈ తరహా గొట్టాలు వినియోగిస్తారు. కెరటాల తాకిడికి ఎక్కడి నుంచో కొట్టుకు వచ్చాయని భావిస్తున్నారు.

ఉచిత బస్సు పథకాన్ని ఘనంగా ప్రారంభించాలి

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు వీలుగా శుక్రవారం ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. ఆర్ఎం కార్యాలయంలో మంగళవారం డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి డిపోలో ఉచిత రవాణా బస్సులను ఘనంగా ప్రారంభించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను ఆహ్వానించాలన్నారు. బస్సుల్లో సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉచిత రవాణా కారణంగా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడం వల్ల కొద్దిరోజుల పాటు రద్దీ ఎక్కువగా ఉంటుందని, దానిని నియంత్రించుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. అవసరమైన మేరకు అదనపు సర్వీసులు నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. మహిళా ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలిగేలా సిబ్బందికి సూచించాలన్నారు. డిపో మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు అప్రమత్తం గా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

కారు ఢీకొని బాలుడి మృతి



వర్షిత్ (ఫైల్ ఫొటో)

కంచరపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఏడాదిన్నర బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం సుభాష్ నగర్‌లో జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన కాశీ మహంతి రాంబాబు, బిందు దంపతులకు ఏడాదిన్నర వయసున్న వర్షిత్ ఉన్నాడు. మంగళవారం సాయంత్రం బిందు తన తల్లి కనకరత్నంతో కలిసి ఆటో ఎక్కడానికి సుభాష్‌నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా కంచరపాలెం వైపు వస్తున్న కారు ఢీకొంది. దీంతో బిందు, కనకరత్నం కింద పడిపోగా వర్షిత్ ఎగిరిపోయాడు. బాలుడి మీదుగా కారు వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వర్షిత్ తండ్రి రాంబాబు ప్లంబర్. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి, ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఖైదీ మృతి

ఆరిలోవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో విశాఖ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. సూపరింటెండెంట్ ఎం.మహేశ్‌బాబు తెలిపిన వివరాల మేరకు... ఆరిలోవ దుర్గాబజారుకి చెందిన కోలేటి బాలయోగి (76) బాలికపై అత్యాచారం చేసిన కేసులో ముద్దాయి. ఇతడికి కోర్టు 20 ఏళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించింది. 2022 అక్టోబరు 17 నుంచి విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఆస్మాతో పాటు కార్డియక్ సమస్యతో ఆరునెలలుగా చికిత్స పొందుతున్నాడు. సోమవారం జైలు క్యాంటీన్ వద్ద కుప్పకూలిపోవడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు ఆర్డీవో జైలును పరిశీలించి, నివేదిక తయారుచేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఖైదీ బంధువులకు అప్పగించామన్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు

పద్మనాభం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు, అల్యూమినియం వైరు చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను పట్టుకొని, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పాండ్రంగి, అనంతవరం, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. దీనిపై రెండు బృందాలుగా తనిఖీలు చేయగా ఈనెల 10న అనంతుని ఘాట్ రోడ్డు వద్ద ముగ్గురు కాపర్ వైరుతో వెళ్తుండగా ఎస్ఐ శ్రీకాంత్ విచారించి, చోరీ చేసినట్టు గుర్తించారు. వారి వద్ద 21 కిలోల రాగి, 5 కిలోల అల్యూమినియం వైరు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు జె.అప్పలనాయుడు, కె.రాంబాబు, ఎస్.సోమేష్‌లను అరెస్టు చేసి రిమాండుకు పంపామన్నారు.

లోన్‌యాప్ బాధితులకు ఊరట

- 20 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు: సీపీ



చెక్కును చూపిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

మహారాణిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లోన్ యాప్‌లతో మోసం చేసిన సైబర్ క్రైమ్ నేరగాళ్లను అరెస్టు చేయడంతో పాటు బాధితులకు పోలీసులు ఊరట కలిగించారు. ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారికి రాష్ట్రంలోనే మొదటిసారి సైబర్ క్రైమ్ పోలీసులు సీజ్ చేసిన డబ్బును అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ గణాంకాల ప్రకారం 295 లోన్‌యాప్ బాధితులను గుర్తించామని, అందులో సుమారు వంద మంది అధికమొత్తంలో నష్టపోయారన్నారు. లోన్ యాప్‌ల కేసులో సీజ్ చేసి న క్రిప్టో కరెన్సీని ఇండియన్ కరెన్సీలోకి మార్చి, సుమారు రూ.50 లక్షలను బాధితుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు లీగల్‌ప్రాసెస్ పూర్తి చేశామన్నారు. రూ.12 లక్షలు పోగొట్టుకున్న బాధితుడికి రూ.7.49 లక్షలు, మరో యువతి రూ.15 లక్షలు పోగొట్టుకుని రెండు సార్లు ఆత్మహత్యకు ప్రయత్నించిందని, ఆమెకు కొంతమొత్తం రికవరీ చేశామన్నారు. లోన్ తీసుకోకుండానే రూ.3 లక్షలు చెల్లించిన బాధితుడికి ఊరట కలిగించామన్నారు. ఈ కేసుల్లో 20 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. లోన్ యాప్‌లపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎమ్మెల్యే గంటాపై ఎన్నికల కేసు కొట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుపై 2009 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనకాపల్లి టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు సోమవారం కొట్టివేసింది. గంటా శ్రీనివాసరావు ప్రజారాజ్యం పార్టీ నుంచి 2009లో అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ సమయంలో ఓటర్లకు 27 క్రికెట్ కిట్లు, మూడు చీరలు, పార్టీ ప్రచార సామగ్రి పంచుతున్నారనే అభియోగాలతో, వాటిని సీజ్ చేసి అనకాపల్లి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి విచారణ జరిపిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పోలీసులు ఆరోపణలు నిరూపించలేకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించిందని సీనియర్ న్యాయవాది ఉగ్గిన సూర్యనారాయణ తెలిపారు.

అదానీ గంగవరం పోర్టు కొత్త డెప్త్ రికార్డు

గాజువాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టు సముద్ర కార్యాకలపాల్లో ఘనతను సాధించిందని పోర్టు యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అత్యధిక లోతులో నౌకను విజయవంతంగా నిలిపిందన్నారు. వేదాంత లిమిటెడ్ కోసం 1,77,121 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ను తీసుకువచ్చిన ఈ నౌక 18.2 మీటర్ల డ్రాఫ్ట్‌తో (డెప్త్) అన్‌లోడింగ్ తరువాత విజయవంతంగా బయలుదేరిందని తెలిపింది. నౌకను సరిగ్గా నిలపడం, త్వరగా పనులు పూర్తి చేసి, సరకు కచ్చితంగా నిర్వహించామన్నారు. పెద్దఎత్తున ముడిసరకు దిగుమతులపై ఆధారపడే పరిశ్రమలకు ఈ సామర్థ్యం ఖర్చులు తగ్గించుకోవటానికి ఉపయోగపడుతుందన్నారు.

విద్యుత్ మీటర్ల ఆధార్ సీడింగ్ లోపాలపై విచారణ

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ మీటర్లకు తప్పుగా చేసిన ఆధార్ సీడింగ్‌పై విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఛైర్మన్, రిటైర్డ్ జిల్లా జడ్జి బి.సత్యానారాయణ మంగళవారం విచారణ చేశారు. డిస్కమ్ పరిధిలోని 11 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్ల (ఎస్ఈ)ను ఆన్‌లైన్‌లోకి ఆహ్వానించి తక్షణమే వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయాలని ఆదేశించారు. పేదల ఆధార్ నంబర్లను ధనవంతుల విద్యుత్ మీటర్లకు సీడింగ్ చేయడం వల్ల వారు ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నారంటూ వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ చేసిన ఫిర్యాదుపై విచారణ జరపగా ఎస్ఈలు సచివాలయాల్లో అప్‌డేట్ కావడం లేదని ఆరోపించారు.

క్యాన్సర్ బాధితులకు అపోలో బాసట

- అందుబాటులోకి 1800203106624 టోల్‌ఫ్రీ నంబరు



మాట్లాడుతున్న అపోలో వైద్యులు

ఆరిలోవ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న, చికిత్స అనంతరం మందులు వాడుతున్న వారి సమస్యలు వివరించేందుకు దేశంలోనే మొదటిసారిగా అపోలో వైద్యశాల టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు మంగళవారం ఆరిలోవ అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ క్యాన్సర్ ప్రారంభదశలో ఎలాంటి ప్రాణనష్టం లేకుండా రోగి బయటపడే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించేందుకు కొంతమంది ముందుకు రావడం లేదని, దీంతో వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందన్నారు. క్యాన్సర్ అనుమానితులు టోల్‌ఫ్రీ నంబరు 1800203106624కు ఫోన్‌చేసి ప్రారంభదశలోనే పరీక్షలు చేయించుకునేందుకు వీలు కల్పిస్తున్నామన్నారు. ఇది 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వైద్యులు ఎంపీఎన్ చంద్రకళ్యాణ్, పి.నిరంజన్, కె.ధీరజ్, రాకేష్‌రెడ్డి, ప్రదీప్, సీవోవో డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.